# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 సంచిక : 267 ఆదివారం 21 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను


## వయనాడ్‌లో రాహుల్ గాంధీ ఓటమి ఖాయం



- ప్రధాని మోదీ విమర్శనాస్త్రాలు
- తొలి దశ పోలింగ్ ఎన్డీయే కూటమికి అనుకూలంగా జరిగినట్లు తెలుస్తోంది
- ఏప్రిల్ 26 తర్వాత గెలుపొందే స్థానంపై దృష్టి సారించాలని ఎద్దేవా
- లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేకనే పలువురు 'ఇండియా కూటమి' నేతలు రాజ్యసభకు వెళ్తున్నారు



## మరో 3 రోజులు ఇదే చల్లదనం

- తెలుగు రాష్ట్రాలకు కూల్ న్యూస్
- కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వానలు కురిసే అవకాశం
- ఆయా జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ
- కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు

# తెలంగాణకు బీజేపీ అగ్రనేతలు

- త్వరలో ప్రధాని మోదీ, అమిత్ షా పర్యటన
- ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని స్పీడప్ చేసిన బీజేపీ
- నామినేషన్లు ముగిసిన వెంటనే మరింత వేగం
- అక్షరాస్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడమే ధ్యేయం
- ఈ నెల చివరి వారంలో రానున్న ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా



హైదరాబాద్

తెలంగాణపై భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఫోకస్ పెంచింది. డబుల్ డిజిట్ టార్గెట్‌గా రాష్ట్రానికి బీజేపీ జాతీయ నేతలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ హైకమాండ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. ఇందు కోసం ప్రత్యేక షెడ్యూల్ కూడా రెడీ రూపొందించింది. ఇప్పటికే బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటించారు. పార్టీ శ్రేణులతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఇక తాజాగా మరోసారి ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండంకెల సీట్లు సాధించడమే ధ్యేయంగా బీజేపీ అగ్రనాయకత్వం తెలంగాణలో పర్యటించనుంది. ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని స్పీడప్ చేసిన బీజేపీ.. నామినేషన్లు ముగిసిన వెంటనే మరింత వేగం పెంచనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ 27న -మిగతా3లో

# టచ్ చేస్తే మాడి పోతారు



- కాంగ్రెస్‌ని టచ్ చేస్తే హైటెన్షన్ వైర్‌ని టచ్ చేసినట్లే: రేవంత్
- జైపాల్ రెడ్డి, జానా రెడ్డి కాదు.. ఇక్కడున్నది రేవంత్
- కాంగ్రెస్ ఎలా ఖాళీ అవుతుందో నేనూ చూస్తా అంటూ సవాల్
- కేసీఆర్ మోదీతో కలిసివస్తారో.. ఎవరితో వస్తారో రావాలి
- పదేళ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది
- పదేళ్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ పవర్‌లో ఉంది
- రెండూ కలిసి మెదక్‌కి చేసింది ఏమైనా ఉందా

హైదరాబాద్

ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి సాక్షిగా నేను మాటిస్తున్నా.. ఆగస్ట్ 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం.. వచ్చే ఏడాది పంటకు రూ.500 బోనస్ ఇచ్చే బాధ్యత నాది.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వంద రోజులకే దిగిపొమ్మని కేసీఆర్ అంటున్నారు.. దిగిపోవడానికి తాము అల్లా టప్పాగా అధికారంలోకి రాలేదని.. %దీ=హా%ను తొక్కుకుంటూ అధికారంలోకి వచ్చామన్నారు. పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని కేసీఆర్ అంటున్నారు.. 20 మంది టచ్‌లో ఉన్నారని అంటున్నారు.. కాంగ్రెస్ ఎలా ఖాళీ అవుతుందో నేనూ చూస్తా.. అంటూ సవాల్ చేశారు. కేసీఆర్ మోదీతో కలిసివస్తారో.. ఎవరితో వస్తారో రావాలి.. అని.. ఇక్కడుంది జైపాల్‌రెడ్డి, జానారెడ్డి కాదు.. రేవంత్ అంటూ పేర్కొన్నారు. కాంగ్రెస్‌ని టచ్ -మిగతా3లో

## కామ్రేడ్స్‌కి కాంగ్రెస్ ప్రపోజల్



- లెఫ్ట్‌పార్టీలు సర్దుకుపోతాయా?
- పార్లమెంట్ ఎన్నికల్లో ఎర్రజెండాలు హస్తం పార్టీతో కలిసొస్తాయా?
- చేరో సీటిచ్చినా చాలని లెఫ్ట్‌పార్టీలు ప్రపోజ్ పెట్టినా ఒక్కటీ ఇచ్చేలా లేదు
- సీపీఐ ఇంకా వెయిటింగ్‌లో ఉంటే.. సీపీఎం మాత్రం తగ్గేదేలేదంటోంది
- లెఫ్ట్‌పార్టీలతో కాంగ్రెస్ దోస్తీపై ఊహాగానాలే తప్ప క్లారిటీ లేదిప్పటిదాకా
- అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షం సీపీఐకి కొత్తగూడెం సీటిచ్చింది కాంగ్రెస్.

హైదరాబాద్

ఎర్రజెండాలతో దోస్తీ చేయాలనుకుంటోంది కాంగ్రెస్. నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరిస్తే ఎలాగంటోంది సీపీఎం. చేరో సీటిచ్చినా చాలని లెఫ్ట్‌పార్టీలు ప్రపోజ్ పెట్టినా ఒక్కటీ ఇచ్చేలా లేదు కాంగ్రెస్. దీంతో సీపీఐ ఇంకా వెయిటింగ్‌లో ఉంటే.. సీపీఎం మాత్రం తగ్గేదేలేదంటోంది. ఈసారికి సహకరించండి.. మీ మంచి చెడ్డా మేం చూసుకుంటామంటోంది కాంగ్రెస్. ఈ పార్లమెంట్ -మిగతా3లో





## కేసీఆర్‌లో ఫ్రస్టేషన్ పెరిగిపోయింది

- ఎమ్మెల్యేలను కూడా కాపాడుకోలేకపోతున్నారు
- ఓటమిని కేసీఆర్, కేటీఆర్ ఇంకా అంగీకరించడం లేదన్న కిషన్ రెడ్డి
- లిక్కర్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో బీఆర్ఎస్ కూరుకుపోయిందని విమర్శ
- బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడిందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేకపోతోంది..
- రేవంత్ మళ్లీ మోసం చేస్తున్నారు.. కిషన్ రెడ్డి ఫైర్..
- బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడింది
- గులాబీ పార్టీ ఓడిపోయి ఐదు నెలలు గడిచినా.. కేసీఆర్, కేటీఆర్ ఇంకా ఓటమిని అంగీకరించలేదు

## అమెరికాలో హెచ్5ఎన్1 కలకలం

- తొలిసారి ఆవు పాలలో బర్డ్‌ఫ్లూ, డబ్ల్యూహెచ్‌వో ఆందోళన
- ఆరు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి
- ఆవు పాలలో అధిక సాంద్రతతో వైరస్, డబ్ల్యూహెచ్ఓ ఆందోళన






## బీజేపీ ఆ విషయంలో వెనకడుగేయదు

- "ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ వర్గానికి చెందినవారు
- వెనుకబడిన తరగతుల కోసం బీజేపీ అనేక పథకాలు అమలు చేస్తోంది
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కోరినా.. మేం అలా చేయం
- ఇది మోదీ గ్యారంటీ.
- కాంగ్రెస్ వెనుకబడిన తరగతులను (ఓబీసీ) వ్యతిరేకించే పార్టీ
- కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా

# బీజేపీ ఆ విషయంలో వెనకడుగేయదు

**జైపూర్:** కాంగ్రెస్ పార్టీ వెనకబడిన తరగతులకు వ్యతిరేకమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. రాజస్థాన్‌లోని కోటా లోక్‌సభ ఎంపీ అభ్యర్థి ఓం బిర్లాకు మద్దతుగా జరిగిన ఎన్నికల ర్యాలీలో షా ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను విపక్షాలు తొలగించాలని కోరుతున్నప్పటికీ.. బీజేపీ ఎట్టిపరిస్థితుల్లో వాటిని తొలగించదన్నారు.



"ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ వర్గానికి చెందినవారు. వెనుకబడిన తరగతుల కోసం బీజేపీ అనేక పథకాలు అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కోరినా.. మేం అలా చేయం. ఇది మోదీ గ్యారంటీ. కాంగ్రెస్ వెనుకబడిన తరగతులను (ఓబీసీ) వ్యతిరేకించే పార్టీ. అప్పటి యూపీఏ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేయలేదు. రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చ సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రెండున్నర గంటల పాటు దానికి వ్యతిరేకంగా మాట్లాడారు. వెనుకబడిన కమిషన్‌కు రాజ్యాంగ గుర్తింపు కల్పించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలు ప్రతి మూడు నెలలకోసారి విదేశాలకు విహారయాత్రలకు వెళ్తారు. ప్రియాంక గాంధీ ఎన్నికలున్నాయనే కారణంతో థాయ్‌లాండ్ నుంచి తిరిగి వచ్చారు. వారికి దేశ ప్రజలపై ప్రేమ ఎక్కడిది. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉగ్రవాదులు చొరబడి దాడులు చేసేవారు. బీజేపీ హయాంలో ఒక్క ఉగ్రదాడి జరిగిన దాఖలాలు లేవు. దేశంలోని అన్ని కేంద్ర సంస్థల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషిచేశాం. ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని మోదీ పెంచారు. మా హయాంలో కమ్మరి, టైలర్లు, వడ్రంగులు, పడవలు తయారు చేసే వారు.. ఇతర చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం అందించేందుకు రూ.13,000 కోట్లు వెచ్చించి నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి పథకాలతో అనుసంధానం చేశాం. గత 10 ఏళ్లలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాం. ఈవీఎంపై కమలం గుర్తు బటన్‌ను గట్టిగా నొక్కండి. తద్వారా ఇటలీలో షాక్‌లు ఉద్భవించాలి. రాజస్థాన్‌లో బీజేపీ 25 సీట్లు సాధించబోతోంది. మేం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి" అని షా పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌కు ఓటు వేస్తే...**

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తే.. నిషేధిత సంస్థలు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) వంటి సంస్థలు పునరజ్జీవనం పొందుతాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని.. దీంతో పీఎఫ్ఐ సంస్థకు రాజస్థాన్‌లోని కోట కేంద్రంగా మారిందని ఆరోపించారు. అదే బీజేపీకి ఓటు వేసి ఉంటే ఆ సంస్థను నామరూపాలు లేకుండా చేసేవాళ్లమన్నారు. శనివారం రాజస్థాన్ కోటాలో విజయ్ సంకల్ప్ మహాసమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. కేరళలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే.. పీఎఫ్ఐపై నిషేధం ఎత్తి వేస్తామని ఆ పార్టీ చెప్పిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి నిరోధక పార్టీ అని ఆయన అభివర్ణించారు. పీఎఫ్ఐపై కేంద్రం నిషేధం విధించడాన్ని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ స్వాగతించిందని తెలిపారు. అలాగే ఈ తరహా చర్యలే ఆరెఎస్ఎస్‌పై తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరిందన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఓటు వేసే ముందు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అయితే మీ ముందు రెండు ఆప్షన్లు ఉన్నాయన్నారు. ఒక వైపు ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని తెలిపారు. ఆయన దేశం కోసం గత 23 ఏళ్లుగా అంకిత భావంతో పని చేస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు రాహుల్ గాంధీ ఉన్నారని చెప్పారు. అయితే ఆయన చాలా కాలంగా రాజకీయాల్లో ఉన్నారని.. కానీ ప్రతి సారి ఆయన విఫలమవుతూ వస్తున్నారన్నారు. రాజస్థాన్‌లో తొలి దశ పోలింగ్ భాగంగా 12 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయని.. అవన్నీ బీజేపీ ఖాతాలోనే పడతాయన్నారు. అయితే మూడోసారి మోదీ ప్రధాని పీఠాన్ని అధిష్టించేందుకు రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని ఆ రాష్ట్ర ప్రజలకు అమిత్ షా పిలుపు నిచ్చారు. ఇక రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్‌పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. తన కుమారుడు వైభవ్ గెహ్లాట్ కోసం ఎన్నికల ప్రచారానికి వెళ్లి ఇరుక్కుపోయాడని ఆరోపించారు. అయితే జలోర్ లోక్ సభ స్థానం నుంచి బరిలో దిగిన వైభవ్ గెహ్లాట్ భారీ ఓట్ల తేడాతో ఓటమి పాలవుతున్నారని అమిత్ షా ప్రకటించారు.


## 400 సీట్ల లక్ష్యం అంత ఈజీ కాదు..



ప్రధాని నరేంద్ర మోదీపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మరోసారి విరుచుకుపడ్డారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 400 కు పైగా సీట్లు కైవసం చేసుకుంటుందన్న ప్రధాని ప్రకటనను ఆయన ఖండించారు. సాగునీటి కుంభకోణానికి సంబంధించి ప్రధాని చేసిన ప్రకటనపైనా ఆయన మండిపడ్డారు. ఇందులో బాధ్యులెవరో తెలపాలన్నారు. ఈ కుంభకోణంపై విచారణ జరిపి, నిజానిజాలను ప్రజలకు చెప్పాలని శరద్ పవార్ డిమాండ్ చేశారు. ఇందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. నాగ్‌పూర్‌లోనే కాకుండా భోపాల్ సమావేశంలోనూ ప్రధాని మోదీ నీటి పారుదలతో పాటు రాష్ట్ర సహకార బ్యాంకు కుంభకోణంపై ఎన్సీపీ పార్టీని ఆరోపించారు. గత పదేళ్లల్లో ఏం చేశారో చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో మహావికాస్ అఘాడి, మహాయుతి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఈ పొత్తులు, కూటములు రెండింటిలోనూ ఒక్కొక్కటి మూడు పార్టీలు ఉన్నాయి. మహావికాస్ అఘాడిలో సీట్ల కేటాయింపు ఫార్ములా 22, 16, 10. ఇందులో ఠాక్రే నేతృత్వంలోని శివసేనకు 22, కాంగ్రెస్‌కు 16, శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 10 సీట్లు వచ్చాయి. ఎన్సీపీకి ఎందుకు తక్కువ సీట్లు వచ్చాయన్న ప్రశ్నపై స్పందించిన పవార్ తమ పార్టీ టార్గెట్ లోక్ సభ కాదని, అసెంబ్లీ అని అన్నారు.

ఈ లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడి 50 శాతం సీట్లు గెలుచుకుంటుందని శరద్ పవార్ అశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎక్కువ సీట్లు సాధించి, ఎక్కువ సంఖ్యలో మిత్రపక్షాలను లోక్‌సభకు పంపడమే తమ లక్ష్యం అని తెలిపారు.

## అమెరికాలో హెచ్5ఎన్1 కలకలం



ఆవు పాలల్లో బర్డ్ ఫ్లూ వైరస్ అధిక సాంద్రతలో గుర్తించడం ఆందోళన రేపింది. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా స్పందించింది. అమెరికాలోని ఆవు పాలలో హెచ్5ఎన్1 వైరస్ అధిక సాంద్రతల్లో ఉండడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. అయితే పచ్చి పాలలో మాత్రమే ఈ వైరస్ ఉందనీ, పాలను వేడి చేసినప్పుడు ఈ వైరస్ నాశనమవుతోందని నిపుణులు అంటున్నారు. అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. అమెరికాలో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం ఆరు రాష్ట్రాల్లో కనీసం 13 మందలను ప్రభావితం చేసింది. టెక్సాస్, కాన్సాస్, మిచిగాన్, న్యూ మెక్సికో, ఇడాహెూ, ఒహియో, నార్త్ కరోలినా , సౌత్ డకోటా లో ఆవులు బర్డ్ ఫ్లూ వైరస్ బారినట్టు గుర్తించారు. టెక్సాస్‌లో ఈ వైరస్ సోకిన తొలి గుర్తించినట్టు డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ ఇన్‌ఫ్లుఎంజా ప్రోగ్రామ్ హెడ్ డాక్టర్ వెన్కింగ్ జాంగ్ తెలిపారు. ఇది పక్షుల నుండి ఆవుకు ఆ ఆవు ద్వారా ఇతర ఆవులకు సోకిందన్నారు.

బర్డ్ ఫ్లూ కారక హెచ్5ఎన్1 వైరస్‌ను 1996లో ప్రారంభంలో తొలిసారిగా గుర్తించారు ఆ తరువాత వేగంగా విస్తరించింది. 2020 నుండి బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందడం వల్ల ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ అడవి పక్షులు, పౌల్ట్రీలు మరణించాయి. అంతేకాదు ఈ వైరస్ మానవులు, పిల్లులు, ఎలుగుబంట్లు, నక్కలు, మింక్ ,పెంగ్విన్‌లతో సహా వివిధ క్షీరదాలకు సోకింది. గత నెలలో, ఆవులు , మేకలుకూడా ఈ జాబితాలో చేరిపోయాయి. ఇది ఇంతవరకు వీటిని ఈ వైరస్ సోకదని భావించిన నిపుణులు ఆశ్చర్యపరిచింది.

## తొలి బిడ్డ దక్కలే.. ఇపుడు ఏకంగా ఆరుగురు



పాకిస్థాన్‌లో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. రావల్పిండికి చెందిన జీనత్ వాహీద్ అనే మహిళ ఒకే కాన్పులో ఏకంగా ఆరుగురు బిడ్డలకు జన్మనిచ్చింది. వీరిలో నలుగురు మగ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వీరంతా ఆరోగ్యంగా ఉండటం విశేషం. దీంతో గతంలో ఒక బిడ్డను కోల్పోయిన ఈ జంట సంతోషంలో మునిగి తేలుతున్నారు. సుదీర్ఘ ఆపరేషన్ చేసి మరీ వైద్యులు తల్లీబిడ్డల్ని రక్షించారు. తల్లి, ఆమె ఆరుగురు పిల్లలు ఏ సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ జాఫర్ తెలిపారు. అలాగే శిశువుల శరీర బరువు కూడా సాధారణంగానే ఉందన్నారు. మహిళకు తగిన వైద్య సహాయం, ఆమె కుటుంబానికి సౌకర్యాలు అందించినట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు.

## మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా



**ఢిల్లీ :** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలు శిక్షను అనుభవిస్తున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా మధ్యంతర బెయిల్ కోసం అప్లయ్ చేశారు. శనివారం బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. కొద్ది రోజుల క్రితం లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసేందుకు తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.ఆ బెయిల్ పిటిషన్‌పై నేడు రౌస్ అవెన్యూకోర్టు విచారణ చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థలతో పాటు సిసోడియా తరపు న్యాయవాది వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఏప్రిల్ 30కి రిజర్వ్ చేశారు.

**ఈడీ,సీబీఐ ఆరోపణలు**

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని రూపొందించడంలో విధానపరమైన జోక్యం, ప్రత్యేకంగా మద్యం సంస్థల ప్రయోజనాల కోసం సర్దుబాటు చేయడం రాష్ట్ర ఖజానాకు అనేక వందల కోట్ల నష్టం కలిగించడం వంటి చర్యలకు సిసోడియా పాల్పడ్డారని కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. సిసోడియాలో గత ఏడాది ఫిబ్రవరిలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ తర్వాతి నెలలో ఈడీ అదుపులోకి తీసుకుంది.

# అక్కడ ఎవరూ ఓటు వేయలేదు.. ఎందుకో తెలిస్తే షాకవుతారు!

సార్వత్రిక ఎన్నికల మొదటి దశ ఓటింగ్ పూర్తయింది. శుక్రవారం 21 రాష్ట్రాల్లో 102 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్ల ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఒక గ్రామంలోని ప్రజలు ఓటు వేయనేలేదు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలోని మారుమూల గ్రామ ప్రజలకు మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరించాలని ఎవరూ ఓటు వేయకూడదని హెచ్చరించారు. అయినప్పటికీ ప్రజలు వీటిని లెక్క చేయకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ బీజాపూర్ సమీపంలోని సుక్మా జిల్లాలో ఉన్న పువర్తి, మావోయిస్టులకు బలమైన స్థావరం. ఇది నక్సల్ నేత హిడ్మాకు చెందింది. బస్తర్ లోక్‌సభ స్థానంలో మొత్తం 67.56 శాతం ఓటింగ్ నమోదైంది. అయితే పువర్తి గ్రామంలో పోలింగ్ రోజున ఓటర్లు ఎవరూ ఓటు హక్కును వినియోగించుకోలేదు. గ్రామస్థులు నక్సలైట్లకు భయపడటం వల్ల ఓటు వేయలేదని అధికారులు భావిస్తున్నారు. పువర్తి, టేకల్‌గుడియం, జోనగూడ గ్రామాలకు సంబంధించిన పోలింగ్ బూత్‌ను పువర్తికి దాదాపు 20 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న




సిల్గర్ గ్రామంలో ఏర్పాటు చేశారు. పువర్తి బూత్‌లో మొత్తం 547 మంది ఓటర్లు ఉండగా, పువర్తి గ్రామానికి చెందిన వారు ఒక్కరు కూడా ఓటు వేయడానికి రాలేదు.

# వయనాడ్‌లో రాహుల్ గాంధీ ఓటమి ఖాయం

**ముంబై :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత, కేరళ వయనాడ్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రాహుల్ గాంధీ ఓడిపోతారని,ఆ తర్వాత సురక్షితమైన సీటు వెతుక్కోవాలని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శనాస్త్రాలు సంధించారు.

మహారాష్ట్రలోని నాందేడ్‌లో నాందేడ్, హింగోలి లోక్‌సభ స్థానాల బీజేపీ అభ్యర్థుల తరుపున మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ఎన్డీయే కూటమికి అనుకూలంగా జరిగినట్లు తెలుస్తోందని అన్నారు.



మొదటి దశ పోలింగ్‌లో ఎన్డీయేకు ఏకపక్షంగా ఓట్లు పడినట్లు తెలుస్తోందన్నారు. "అమేథీలో గతంలో ఓడిపోయిన కాంగ్రెస్ యువరాజు.. వయనాడ్‌లోనూ ఓడిపోనున్నారు. విపక్ష ఇండియా కూటమికి చెందిన కొందరు నేతలు(సోనియా గాంధీ) లోక్ సభను వదిలి, రాజ్యసభకు వెళ్లిపోతున్నారు. వారికి ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదు. గత కాంగ్రెస్ హయాంలో జరిగిన పాలనా పరమైన సమస్యలు చక్కదిద్దేం దుకు పదేళ్లు పట్టింది. దేశానికి ఇంకా ఎంతో చేయాల్సింది ఉంది. ఇండియా కూటమి అవినీతి అక్రమాలను కాపాడుకోవ డానికి కలిసి వచ్చిన స్వార్థపరుల గుంపు" అని మోదీ అన్నారు.

**అప్పుడు అమోథీ.. ఇప్పుడు వయనాడ్**

అంతేకాదు గతంలో అమోథీలో ఓడిపోయిన యువరాజు (రాహుల్ గాంధీ) త్వరలో వయనాడ్‌లో ఓడిపోతారని అన్నారు. ఏప్రిల్ 26 తర్వాత గెలుపొందే స్థానంపై దృష్టి సారించాలని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీని ఉద్దేశిస్తూ.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేకనే పలువురు 'ఇండియా కూటమి' నేతలు రాజ్యసభకు వెళ్తున్నారని అన్నారు.

**ప్రతిపక్ష కూటమి స్వార్థపరుల గుంపుగా**

ప్రతిపక్ష కూటమి తమ అవినీతి అక్రమాలను కాపాడుకోవడానికి కలిసి వచ్చిన స్వార్థపరుల గుంపుగా మోదీ అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'ఓటు వేయడం ద్వారా మీరే దేశ భవిష్యత్తును నిర్ణయించిన వారవుతారు. నేను ప్రతిపక్షాల పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని పెంచాలనుకుంటున్నాను. ఎందుకంటే మీరు (ప్రతిపక్ష నాయకులు) ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయం. మీకు మళ్లీ అవకాశం వస్తుంది. ఎన్నికల్లో ఓటు వేసేలా ఓటర్లను ప్రోత్సహించాలని ప్రధాని మోదీ కోరారు.

# ప్రజలు తమ ఓటు వేసే అవకాశాన్ని కోల్పోవద్దు

ఎందుకో తెలీదు కానీ.. తమకు ఓటు హక్కు ఉన్నప్పటికీ కొందరు దానిని వినియోగించరు. పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వేయరు. ఈ నేపథ్యంలోనే.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ చంద్రచూడ్ ఓటర్లకు ఒక కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలో ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి.. ప్రజలు తమ ఓటు వేసే అవకాశాన్ని కోల్పోవద్దని ఆయన సూచించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం పౌరుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికలు-2024' కోసం ఎన్నికల సంఘం 'మై ఓట్ మై వాయిస్' అనే మిషన్‌ని తీసుకొచ్చింది. ఈ మిషన్ కోసం చంద్రచూడ్ ఒక వీడియో సందేశం పంపారు. "మనమంతా ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశపు పౌరులం. రాజ్యాంగం మనకు పౌరులుగా అనేక హక్కులను ఇచ్చింది. అలాగే.. మనపై విధించిన విధులను సైతం నిర్వర్తించాలని ఈ రాజ్యాంగం ఆశిస్తుంది. అందులో ప్రధానమైనది.. [illegible] వేయడం. దీనిని మనం సక్రమంగా



నిర్వర్తించాలి. బాధ్యతాయుతంగా ఓటు వేయాలని నేను ప్రతిఒక్కరినీ అభ్యర్థిస్తున్నాను. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల కోసం ఐదు నిమిషాలు వెచ్చించలేరా? పదండి.. అందరూ కలిసి గర్వంగా ఓటు వేద్దాం" అని ఆ వీడియోలో చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో భారత పౌరులదే ప్రధాన పాత్ర ఉంటుందని.. అందుకే 'ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజలచే, ప్రజల కోసం' అని చెప్పబడుతుందని చంద్రచూడ్ చెప్పుకొచ్చారు. తొలిసారి ఓటరుగా తన ఓటు హక్కుని వినియోగించుకున్నప్పుడు.. తాను దేశ భక్తిలో ఉప్పొంగిపోయానని గుర్తు చేసుకున్నారు. తాను లాయర్‌గా ఉన్నప్పుడు ఓటు వేసే తన బాధ్యతని ఎప్పుడూ మరవలేదని.. తానెంత బిజీగా ఉన్నా ఓటు వేసేందుకు వెళ్లేవాడినని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఈ ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. కాగా.. దేశంలో సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఏప్రిల్ 19వ తేదీన తొలిదశ పోలింగ్ ముగిసింది.

ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, ఇండియన్ ఎవిడెన్స్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను కేంద్రం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలు నేర న్యాయంపై భారతదేశం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కొత్త యుగంగా మార్చాయన్నారు.

# తెలంగాణకు బీజేపీ అగ్రనేతలు..

-మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన తన పర్యటనలో ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలపై బీజేపీ నేతలతో చర్చించనున్నారు. హైటెక్ సిటీ నోవాటెల్‌లో ఐటీ నిపుణులతో మోదీ భేటీ కానున్నారు. అక్షరాస్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడమే ధ్యేయంగా వారితో చర్చించనున్నారు. మోదీ పర్యటన తరువాత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం రాష్ట్రానికి రానున్నారు. ఆయన బీజేపీ కీలక నేతలకు ఎన్నికల వ్యూహాలపై చర్చించి, దిశానిర్దేశం చేయనున్నారు. ఈ లోపే బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సైతం రాష్ట్రంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం తెలంగాణలోని పర్యటించిన ప్రధాని మోదీ ఆదిలాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, నాగర్‌కర్నూల్,




మల్కాజ్‌గిరి సభల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఈ నెల చివరి వారంలో రాష్ట్రంలో పర్యటించబోతున్నట్టు తెలుస్తోంది. మోదీ రాక సందర్భంగా బీజేపీ రాష్ట్ర నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ల పర్వం ఊపందుకోవడంతో మోదీ పర్యటనను దిగ్విజయం చేసేందుకు కషాయం దళం సిద్ధమవుతోంది. ఎక్కువ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు నేతలు. మోదీ సభలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్లాన్ చేస్తోంది.
లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల తర్వాత ప్రచారాన్ని మరింత హోరెత్తించేలా బీజేపీ ప్లాన్ చేస్తోంది. రెండో దశ పోలింగ్ తర్వాత వరసగా తెలంగాణకు అగ్ర నేతల క్యూ కడుతున్నారు. ఈ నెల చివరి వారంలో తెలంగాణకు రానున్న ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో సభలు నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. వీలైనన్ని ఎక్కువ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు.ంంఽ

# కామ్రేడ్స్‌కి కాంగ్రెస్ ప్రపోజల్..

-మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో ఎర్రజెండాలు హస్తంపార్టీతో కలిసొస్తాయా? ఫ్రెండ్లీ కంటెస్ట్ తప్పదంటాయా? అసెంబ్లీ ఎన్నికల్లో స్నేహహస్తం చాచారు. కానీ సీట్ల దగ్గర కాస్త తేడా వచ్చేసరికి లెఫ్ట్‌పార్టీల్లో సీపీఐ సహకరిస్తే, సీపీఎం దూరంగా ఉండిపోయింది. నాలుగునెల్లు తిరిగేలోపే పార్లమెంట్ ఎన్నికలొచ్చేశాయి. దీంతో తెలంగాణలో లెఫ్ట్‌పార్టీలతో కాంగ్రెస్ దోస్తీపై ఊహాగానాలే తప్ప క్లారిటీ లేదిప్పటిదాకా. అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షం సీపీఐకి కొత్తగూడెం సీటిచ్చింది కాంగ్రెస్. దీంతో ఆ పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిధ్యం దక్కింది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఒంటరిపోరుకు దిగిన సీపీఎం ఎక్కడా గెలవలేకపోయినా.. కాంగ్రెస్‌తో మాత్రం ఫ్రెండ్లీగానే ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు బలమున్న ఒక్క సీటైనా ఇవ్వాలని లెఫ్ట్‌పార్టీలు రెండూ కోరుకున్నాయి. ఒక సీటయినా ఇస్తే ఫ్రెండ్‌షిప్ మరింత స్ట్రాంగ్ అవుతుందంటూ కాంగ్రెస్ ముందు నాలుగుసీట్లు ఆప్షన్‌గా పెట్టింది సీపీఐ. సీపీఎం కూడా తమకు బలమున్న చోట ఓ సీటిస్తే చాలనుకుంది. కానీ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ లెఫ్ట్‌పార్టీలతో సీట్లు షేర్ చేసుకునే పరిస్థితుల్లో లేదు. దీనిపై సీపీఐ వేచిచూసే ధోరణితో ఉండగా, సీపీఎం ఇప్పటికే భువనగిరి నుంచి అభ్యర్థిని ప్రకటించింది. ఆ పార్టీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ నామినేషన్ కూడా వేశారు. దీంతో తెలంగాణలో సీపీఎం మద్దతుకోసం కాంగ్రెస్ నాయకత్వం రంగంలోకి దిగింది. ఆ పార్టీ ప్రతినిధిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వచ్చి ఆ పార్టీ ముఖ్యనేతలతో చర్చించారు.
కాంగ్రెస్ నాయకత్వం అభిప్రాయాన్ని.. భట్టి సీపీఎం నేతలతో పంచుకున్నారు. తమ అభిప్రాయాలు, ఆక్షేపణలను లెఫ్ట్ నేతలతో ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇండియాకూటమిలో లెఫ్ట్ పార్టీలు భాగస్వామ్యపక్షాలుగా ఉన్నాయి. కేరళలాంటి రాష్ట్రంలో కొన్ని అభిప్రాయభేదాలు తలెత్తినా మిగిలిన చోట్ల కాంగ్రెస్-సీపీఎం మధ్య స్నేహపూర్వక వాతావరణమే ఉంది.



సీట్లు ఇవ్వలేకపోయినా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని సీపీఎం నేతలకు భట్టి హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి మినహా అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కి మద్దతిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. అయితే కీలకమైన భువనగిరిలో కూడా సీపీఎం పోటీతో నష్టం జరగక్కుండా చూసుకోవాలనుకుంటోంది కాంగ్రెస్. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌నుంచి సానుకూల ప్రకటన కోసం చివరిదాకా వేచిచూసింది సీపీఎం. కానీ కోరుకున్న సీట్ల విషయంలో కాంగ్రెస్ ససేమిరా అనటంతో ఒంటరిగా పోటీకి దిగింది. ఈసారి కూడా కాంగ్రెస్‌నుంచి సానుకూల సంకేతాలేమీ లేకపోవటంతో ఒంటరిపోరుకు సిద్ధమై భువనగిరిలో అభ్యర్థిని ప్రకటించింది. అయితే బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యం కాబట్టి మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కి మద్దతిచ్చేందుకు ముందుకొచ్చింది సీపీఎం.
మాటల్లేవ్ అనకుండా డిప్యూటీసీఎంని చర్చలకు పంపటంతో సీపీఎం మెత్తబడినట్లే కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సహకరిస్తే ఎమ్మెల్సీ లేదా కీలకమైన కార్పొరేషన్ పదవి ఇస్తామని కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. ఒంటరిపోరుతో నష్టమే తప్ప లాభం ఉండదని కామ్రేడ్లకు కూడా తెలుసు. అందుకే ఎర్రజెండా పార్టీలు కూడా తెగేదాకా లాగాలనుకోవడం లేదు. అయితే కేరళ ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లెఫ్ట్ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని సీపీఎం తప్పుపడుతోంది. కాంగ్రెస్ కూడా కలిసొచ్చే పార్టీలనుంచి ఎలాంటి తల్నొప్పులు వద్దనుకుంటోంది. భట్టి ఎంట్రీతో ఆల్‌ఈజ్ వెల్ అనుకుంటోంది అధికారపార్టీ. అటు సీపీఐ కూడా కాంగ్రెస్‌తో కుదిరిన స్నేహాన్ని చెడగొట్టుకోదని భావిస్తున్నారు. స్నేహపూర్వకపోటీకి లెఫ్ట్‌పార్టీలు సిద్ధమైనా జాతీయస్థాయిలో అగ్రనాయకత్వం మాట్లాడకుంటే తెలంగాణలో కాంగ్రెస్‌కి బేషరతుగా మద్దతు పలికే అవకాశం కనిపిస్తోంది.

# టచ్ చేస్తే మాడి పోతారు

-మొదటి పేజీ తరువాయి

చేస్తే హైటెన్షన్ వైర్‌ని టచ్ చేసినట్టే.. కాంగ్రెస్‌ని టచ్ చేస్తే మాడి మసైపోతారు.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డి మెదక్ లో ప్రచారం నిర్వహించారు.
మెదక్‌లో ఇందిరాగాంధీ సెంటిమెంట్‌ను పండించిన రేవంత్ రెడ్డి.. ఇందిర తుదిశ్వాస విడిచింది మెదక్ ఎంపీగానే అంటూ పేర్కొన్నారు. ఆమెను మెదక్ గెలిపించింది కాబట్టే అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీని చూశారు, ఏమైనా అభివృద్ధి చెందిందా.. ఈసారి కాంగ్రెస్‌ని గెలిపించి చూడండి అంటూ పేర్కొన్నారు. బీఆర్ఎస్, కారు పనైపోయింది, ఇక తుక్కుకింద అమ్మడమేనంటూ రేవంత్ విమర్శించారు. పదేళ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని.. పదేళ్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ పవర్‌లో ఉందని.. రెండూ కలిసి మెదక్‌కి చేసింది ఏమైనా ఉందా అంటూ రేవంత్ ప్రశ్నించారు. జెండా, అజెండా మార్చినా రెండూ తోడుదొంగల పార్టీలే అంటూ ఎద్దేవా చేశారు.
తెలంగాణకు ఇంకా తానే ముఖ్యమంత్రిని అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మెదక్ లోక్ సభ నియోజకవర్గంలో నీలం మధుకు మద్దతుగా ఎన్నికల




ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్ కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యం కావాలంటే మెదక్ నుంచి నీలం మధు గెలవాలన్నారు. తనతో ఇరవై మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న కేసీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి స్పందించారు. అసలు ఏం చూసి ఇతర పార్టీల నేతలు బీఆర్ఎస్‌లోకి వెళతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు మెదక్ ప్రజలు ఇందిరమ్మను గెలిపించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు ఇందిరమ్మ అనేక పరిశ్రమలను ఇచ్చారన్నారు. అందుకే దేశం నలుమూలల నుంచి హైదరాబాద్ వచ్చి ఎంతోమంది బతుకుతున్నట్లు చెప్పారు.
మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కి సైతం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. కేంద్ర నిధులతో దుబ్బాకని అభివృద్ధి చేస్తా అన్నారు.. తాము బస్సులేసుకుని వస్తాం, అభివృద్ధి చూపిస్తావా.. దుబ్బాక నుంచి రంగు మార్చి మెదక్ వచ్చారంటూ రేవంత్ పేర్కొన్నారు.


**కర్ణాటకలో ప్రచారం కోసం బెంగళూరుకు రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటకలో ప్రచారం చేయనున్నారు. ఇందుకోసం శనివారం సాయంత్రం బెంగళూరుకు చేరుకున్నారు. ఆయన బెంగళూరులోని సర్వజ్ఞనగర్‌లో రోడ్డు షో నిర్వహించనున్నారు. ఆ తర్వాత మార్తనహళ్లిలోని బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం హొంగసాంద్ర కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించనున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అంతకుముందు మెదక్ లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు తరఫున ప్రచారం నిర్వహించారు.

# రేవంత్ స్థానంలో భట్టి, ఉత్తమ్ ఉంటే..?

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్థానంలో భట్టి విక్రమార్క, లేదంటే ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదా..? ఆ ఇద్దరు నేతలు ఉంటే బీఆర్ఎస్ పార్టీ తన విశ్వరూపం చూపించేదా..? రేవంత్ అంటే ఎందుకు అంత భయం. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొడదామని బీఆర్ఎస్ పార్టీ అనుకుంది. ఆ ఆశలపై రేవంత్ నీళ్లు చల్లారు. ఉద్యమ పార్టీని అధికారానికి దూరం చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకుంటున్నారు. ఉద్యమ పార్టీని బలహీన పరుస్తున్నారు. రేవంత్ తమ కంటిలో నలుసులా మారాడని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ ప్రభ తగ్గింది. వెంటనే కేసీఆర్ అనారోగ్యానికి గురవడం.. తర్వాత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత అరెస్ట్ అయ్యారు. అయినా ఫర్లేదు అనుకునే లోపు పార్టీలో ఎమ్మెల్యేలు మెల్లగా జారుకుంటున్నారు. ప్రకాష్ గౌడ్‌తో చేరికల పర్వం కొనసాగుతోంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ అనడంతో తేనెతుట్టేను కదిలించినట్టు అయ్యింది. ఆ వెంటనే సీఎం రేవంత్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని గట్టి కౌంటర్ ఇచ్చారు. దాంతో కేసీఆర్ సహా అగ్రనేతలు స్పందించని పరిస్థితి. కేటీఆర్, హరీశ్ రావు మాట్లాడినప్పటికీ గట్టిగా కౌంటర్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ రాష్ట్రంలో రేవంత్‌కు కాకుండా ఉత్తమ్, లేదంటే భట్టికి పగ్గాలు ఇస్తే పరిస్థితి మరోలా ఉండేది. కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపు రాజకీయాలు. గ్రూపులను సమన్వయం చేసుకోవడం, విపక్షాలకు కౌంటర్ ఇవ్వడం వారి వల్ల కాదేమో. ఇదే విషయాన్ని కొందరు అనలిస్టులు అభిప్రాయ పడుతున్నారు. ఆ ఇద్దరు నేతలు కూడా ముఖ్యమంత్రి పదవి కోసం చివరి క్షణం వరకు ప్రయత్నించారు. ఢిల్లీ వెళ్లి మరి లాబీయింగ్ చేశారు. కానీ రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అండదండలు ఉండటంతో ముఖ్యమంత్రి పదవి వరించింది. ఇతర పార్టీ నుంచి వచ్చిన నేతలకు కాంగ్రెస్ పార్టీలో పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడం ఎక్కువ అని విశ్లేషకులు అంటుంటారు. అలాంటిది రేవంత్ విషయంలో ముఖ్యమంత్రి పదవి కూడా అప్పగించారు.

## సీఎం రేవంత్‌కు షాక్.. ట్విస్ట్ ఇచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే




**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డికి రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ షాకిచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరబోనని స్పష్టం చేశారు. శనివారం(ఏప్రిల్20) తన క్యాడర్‌తో సమావేశమైన ప్రకాష్‌గౌడ్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే విషయమైఈ భేటీలో కార్యకర్తల నుంచి ఆసక్తికర అభిప్రాయాలు వెల్లడయ్యాయి. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ప్రకాష్‌గౌడ్‌కు పలువురు కార్యకర్తలు సూచించారు. దీంతో ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రయత్నాన్ని ప్రకాష్‌గౌడ్ విరమించుకున్నారు. కాగా, శుక్రవారం(ఏప్రిల్19) సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో ప్రకాష్‌గౌడ్ భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరే విషయం చర్చించేందుకు సీఎంతో ఎమ్మెల్యే భేటీ అయ్యారని ప్రచారం జరిగింది. అయితే కార్యకర్తల నుంచి విభిన్న అభిప్రాయాలు వెల్లడవడంతో పార్టీమార్పు వ్యవహారానికి ప్రకాష్‌గౌడ్ బ్రేక్ వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ కీలకంగా మారడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఏ అడుగు వేసినా చర్చనీయాంశమవుతోంది.

## మరో 3 రోజులు ఇదే చల్లదనం..



భానుడి ప్రతాపానికి బ్రేక్. మండే ఎండల్లో కూల్ న్యూస్. తెలంగాణకు వర్ష సూచన చేసింది వెదర్ డిపార్ట్‌మెంట్. శనివారం(ఏప్రిల్ 20) నుంచి మూడ్రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు పసుపు రంగు హెచ్చిరక జారీ చేసింది. ఈ వర్షాలు చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా ఉంటాయని.. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. శనివారం నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఖమ్మం, నారాయణపేట, కొమరంబీం ఆసిఫాబాద్, కరీంనగర్, నాగర్ కర్నూలు, హన్మకొండ, జనగామ, సిద్ధిపేట, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. అధికారులు చెప్పినట్లే రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఉక్కపోతతో అల్లాడిన జనాలకు రిలీఫ్ దక్కిందనే చెప్పాలి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వడగళ్ల వాన కురిసింది. కొన్ని చోట్ల కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పంట చేతికొచ్చిన సమయంలో వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అయి ఉంది. చాలా ప్రాంతాల్లో వర్షం పడింది. ఇక ఏపీలో కూడా పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. మరో 2 రోజులు రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మొత్తంగా తెలుగు రాష్ట్రాలు కూల్ మోడ్‌లోకి వెళ్లాయి. ఎండలు నుంచి ఉపశమనం పొందుతున్నారు జనాలు.

## కేసీఆర్‌లో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయింది





బీఆర్ఎస్-కాంగ్రెస్ నేతల తీరుపై తెలంగాణ బీజేపీ చీఫ్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండి పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని బీఆర్ఎస్ నేతలు ఇంకా జీర్ణించుకోలేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు కిషన్‌రెడ్డి. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి..మళ్లీ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడిందని... ఆ పార్టీ పని అయిపోయినట్టేనని కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. గులాబీ పార్టీ ఓడిపోయి ఐదు నెలలు గడిచినా.. కేసీఆర్, కేటీఆర్ ఇంకా ఓటమిని అంగీకరించలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ అన్ని పార్టీల కంటే ముందుందని... అభ్యర్థులను కూడా అందరి కంటే ముందే ప్రకటించామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడిందని.. ఆ పార్టీ పని అయిపోయినట్టేనంటూ వ్యాఖ్యానించారు. గులాబీ పార్టీ ఓడిపోయి ఐదు నెలలు గడిచినా.. కేసీఆర్, కేటీఆర్ ఇంకా ఓటమిని అంగీకరించలేదని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు పార్టీ ఓటమిని తట్టుకోలేక బీజేపీపై విమర్శలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ అన్ని పార్టీల కంటే ముందుందని%ౌ% అభ్యర్థులను కూడా అందరి కంటే ముందే ప్రకటించామని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీకి ప్రజల సంపూర్ణ మద్దతు ఉందన్నారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సత్తా చాటుతుందని, ఎక్కువ స్థానాల్లో సీట్లను గెలుచుకుంటామని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గ్యారంటీల అమలు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు కిషన్‌రెడ్డి. గ్యారంటీల విషయంలో రేవంత్ అబద్ధాలు చెబుతున్నారు.. జూన్ 5 తర్వాత గ్యారంటీలు అమలు చేస్తారా..? కామారెడ్డిలో బీఆర్ఎస్‌ను ఓడించింది బీజేపీనే అంటూ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కవిత లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో బీఆర్ఎస్ కూరుకుపోయిందని అన్నారు. బీఆర్ఎస్ కీలక నేతలు పార్టీని వీడుతుండటంతో కేసీఆర్ లో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయిందని చెప్పారు. గెలిచిన ఎమ్మెల్యేలను కూడా నిలబెట్టుకోలేని పరిస్థితిలో బీఆర్ఎస్ ఉందని అన్నారు. జైశ్రీరామ్ నినాదం అన్నం పెడుతుందా? ఉద్యోగాలను ఇస్తుందా? అని కేటీఆర్ అంటున్నారని విమర్శించారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# రాహుల్ విమర్శల్లో వాస్తవమెంత?

నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ విషయాలపై కాంగ్రెస్ ఇతర భాగ స్వామ్య పక్షాలతో కలసి ఐక్య అవగా హన, ఉమ్మడి ప్రణాళికను రూపొం దించుకోలేదు. 'ఇండియా' కూటమి ఉమ్మడి ఏకీకృత కార్యాచరణ పై కూడా స్పష్టత లేదు. ఎవరికి తోచినది వారు మాట్లాడుతున్నారు. ఎవరి దారి వారిదే. బిజెపి లాంటి బలమైన పార్టీతో పోరా డుతున్నామనే సోయి కాంగ్రెస్‌కు ఉన్నట్లు కనపడటం లేదు. ముఖ్యంగా సిఎఎ, ఉమ్మడి పౌరస్మృతి అంశాల మీద కాంగ్రెస్ తన అభిప్రాయాలు ఏమిటో ఎందుకు ఎన్నికల ప్రణాళికలో చేర్చలేదని ప్రజలు ప్రశ్ని స్తున్నారు. సిఎఎ గురించి అమెరికా విమర్శించినా కాంగ్రెస్ పార్టీ ప్రణాళి కలో మాత్రం కనీస ప్రస్తావన కూడా లేకపోవటం శోచనీయం. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ విపక్ష రాష్ట్రాల ముఖ్యమంత్రులను బిజెపి ప్రభుత్వం తన దర్యాప్తు సంస్థలను దుర్వినియోగ పరుస్తూ వెంటపడి వేధించినట్లుగా, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెంట ఎందుకు పడటం లేదంటూ ప్రశ్నంచారు. పైగా ఎల్‌డిఎఫ్‌తో బిజెపికి దోస్తీ కుదిరిందా! అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తున్నాయని వాపోయారు. అందుకే బిజెపిని ఎల్‌డిఎఫ్ విమర్శించటం లేదని, అందుకే బిజెపి దాడి చేయకుండా మిన్నకుందా? అంటూ ఈ అసంబద్ధమైన ప్రశ్నలు వేశారు. నిజానికీ కేరళలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు చాలా తక్కువగా కనపడుతున్నాయి. పైగా కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రుల సంతానం సొంత పార్టీని విమర్శిస్తూ బిజెపిలోకి చేరిపోవడంతో కాంగ్రెస్ పునాదులు కృంగిపోయాయి. కాంగ్రెస్ కార్యకర్తలు వివిధ కారణాలతో బిజెపి పంచన చేరుతున్నారు. అందుకే రాహుల్ ఫ్రస్ట్రేషన్‌లో ఉండి, వాస్తవాలు మరచి చేసిన విమర్శలో డొల్లతనం కనపడుతున్నది. పైగా, గతంలో కాంగ్రెస్ బిజెపితో జతకట్టి సిపిఎం పై పోరాడిన చరిత్రను రాహుల్ అంతత్వరగా మరిచారా? నిజానికి సిపిఎం మొదటి నుండి బిజెపికి, కాంగ్రెస్‌కు సమదూరం పాటిస్తుంది. అవి రెండూ బూర్జువా పార్టీలే అనే అవగాహన మొదటి నుండి చేసేదే. బిజెపి మతతత్వాన్ని, నియంతృత్వ ధోరణినిని దేశ వ్యాప్తంగా వామపక్షాలు చేసినంత తీవ్ర విమర్శలు మరే పార్టీ అయిన చేసిందా? కాంగ్రెస్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. గతంలో కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు గల్లీ నుండి ఢిల్లీ దాకా, పాతాళం నుండి ఆకాశం అంచుల వరకు కాంగ్రెస్ వివిధ స్థాయిల్లో చేసిన అవినీతి, అధికార దుర్వినియోగ చరిత్ర ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం గుప్పిటలో ఉంది. అందుకే బిజెపి కాంగ్రెస్ ను శాశ్వతంగా అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నది. తన దర్యాప్తు సంస్థలను అందుకోసం కాంగ్రెస్ పైన, ఇతర విపక్షాలపైకి ఉసిగొల్పుతుంది. అయితే కాంగ్రెస్ గతంలో చేసిన అవినీతి, అధికార దుర్వినియోగం సిపిఎం చేయలేదు. కనుక బిజెపికి కక్ష తీర్చుకోవడానికి అవకాశం లేకపోయింది. అంతేకానీ బిజెపికి వామపక్షాలపై ప్రేమ ఉండి కాదు. ఇంత వరకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను వామపక్షాలు ఎప్పుడూ, ఎక్కడా, ఎన్నడూ సమర్ధించలేదు. పైగా బిజెపి రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ప్రతి సందర్భంలోనూ ఘాటుగా విమర్శించింది కూడా. బిజెపితో పోరాడటానికి సర్వదా సిద్ధమైన వామపక్షాలతో మిత్రత్వం పెంచుకోవడానికి బదులుగా ఇలా రాజకీయంగా పతనమవుతూ రాహుల్ గాంధీ మాట్లాడటం పెద్ద తప్పు. ఆయన ఉపన్యాసం పరోక్షంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పైన తప్పుడు కేసులు పెట్టమని మోడీని వేడుకున్నట్లుగా కనపడుతున్నది తప్ప మరొకటి కాదు. కాబోయే ప్రధానిగా రాహుల్ గాంధీని ఊహించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇతర అభిమానులు రాహుల్ గాంధీకి అంత పరిణతి ఉందా! అని ప్రశ్నించుకోవాలి. ఇంకా ఆ దశకు రాహుల్ చేరుకోలేదని ఆయన మాటలు, చేతలు దేశ ప్రజలకు తేటగా తెలుపుతున్నాయి. తనకు మిత్రులెవరో, శత్రువులెవరో గుర్తించలేని అస్పష్టత ఆయన మాటల్లో కనపడుతున్నది. ఈ అసంబద్ధ మాటలే 'ఇండియా' కూటమిని ఐక్యత లేకుండా బలహీనం చేస్తుంది. నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ విషయాలపై కాంగ్రెస్ ఇతర భాగస్వామ్య పక్షాలతో కలసి ఐక్య అవగాహన, ఉమ్మడి ప్రణాళికను రూపొందించుకోలేదు. 'ఇండియా' కూటమి ఉమ్మడి ఏకీకృత కార్యాచరణ పై కూడా స్పష్టత లేదు. ఎవరికి తోచినది వారు మాట్లాడుతున్నారు. ఎవరి దారి వారిదే. బిజెపి లాంటి బలమైన పార్టీతో పోరాడుతున్నామనే సోయి కాంగ్రెస్‌కు ఉన్నట్లు కనపడటం లేదు. ముఖ్యంగా సిఎఎ, ఉమ్మడి పౌరస్మృతి అంశాల మీద కాంగ్రెస్ తన అభిప్రాయాలు ఏమిటో ఎందుకు ఎన్నికల ప్రణాళికలో చేర్చలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సిఎఎ గురించి అమెరికా విమర్శించినా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలో మాత్రం కనీస ప్రస్తావన కూడా లేకపోవటం శోచనీయం. ఈ ప్రధాన అంశాలపై పోరాడిన చరిత్ర కూడా కాంగ్రెసు శ్రేణులకు లేదు. పైగా సిఎఎకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో కలసి కేరళ ప్రభుత్వం నిరసన తలపెడితే చివరి క్షణంలో కాంగ్రెస్ మెల్లెగా వెనక్కు జారుకుంది. ఈ విషయంలో కాంగ్రెస్ తమ ఉద్దేశాలను ప్రజలకు చెప్పితీరాలి. అలాగే జమ్మూలోని కథువాలో 8 ఏళ్ళ బాలిక మీద అత్యాచారం, హత్య చేసిన ఉదంతం దేశంలో తీవ్ర సంచలనం కలిగించిన విషయంగా అందరికీ తెలిసిందే. ఈ కథువా ఉదంతంలో నిందితులకు మద్దతుగా ప్రదర్శనలు చేసిన వారిలో ఒకడైన బిజెపి నేత చౌదరి లాల్ సింగ్‌ను స్వయంగా రాహుల్ గాంధీ గత నెలలో కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడం దేశ ప్రజలకు ఆశ్చర్యం, ఆందోళన కలిగించింది. ఇప్పుడు ఏకంగా ఆ నిందితుడు చౌదరీ లాల్ సింగ్‌ను ఉదంపూర్ లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ నిలిపడం దేశాన్ని షాక్‌కు గురిచేసింది. ఇదేనా దేశ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చే హామీ. రాజకీయంగా బిజెపిని వ్యతిరేకించడం అంటే? ఎన్నికల బాండ్ల కుంభకోణంలో బిజెపి ప్రధానంగా లాభపడిన మాట నిజమే. అది దేశ సంపదను లూటీ చేసిందని రాహుల్ విమర్శించాడు. బాగానే ఉంది. కానీ, కాంగ్రెస్ కూడా అదే ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 1,952 కోట్లు లబ్ధి పొందిన రెండవ అతి పెద్ద పార్టీ. అది మాత్రం లూటీదారుడు ముద్ర పడకుండా తప్పించుకుంటుందా? కాంగ్రెస్ ఇప్పటికైనా తన ఎన్నికల ప్రచారంలో ఊహలు, భ్రమలు వీడాలి. తన పార్టీ ప్రణాళికలో ఆచరణ సాధ్యమైన విషయాలను మాత్రమే ప్రధానంగా ప్రస్తావించాలి. ఆచరణ సాధ్యం కాని వాటిని బహిరంగంగా ప్రకటించి వాటిని వదులుకోవాలి. ఇప్పటికే కర్నాటకా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అలవిగాని ఎన్నికల వాగ్దానాలు చేశాయి. వాటిని ఆచరణలో నెరవేర్చలేక నానాఅగచాట్లు పడుతున్నాయి. బిజెపి ఎన్నికల గ్యారెంటీలోని లోపాలను కూడా కాంగ్రెస్ సహేతుకంగా విమర్శించాలి. అంతేగానీ బలమైన బిజెపిని ఎదుర్కొనే భావసారూప్యం గల మిత్రపక్షాలలో చీలికలు తీసుకు రావడానికి రాహుల్ మాటలు, చేతలూ దోహదం చేయకుండా చూసుకోవాలి. చేసిన తప్పులు సరిదిద్దుకోలేకపోతే ముప్పును ఎదుర్కోక తప్పదు.

# సుస్థిరాభివృద్ధికి సివిల్ సర్వెంట్స్



భారత ప్రభుత్వంలో ప్రధాన విధులు నిర్వహిస్తున్న పౌర సేవకులు లేదా సివిల్ సర్వెంట్స్ "స్టీల్ ఫ్రేమ్ ఆఫ్ ఇండియా" అంటూ 21 ఏప్రిల్ 1947న స్వతంత్ర భారతంలో తొలిసారి పౌర సేవకులను ఉద్దేశించి భారత ప్రథమ హోమ్ మినిస్టర్ సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ అభివర్ణించారు. నైతికతను పెంచి పోషించడం, నిస్వార్థ ప్రజా సేవకులుగా పని చేయడం, జాతీయ సమైక్యతకు ఊతం ఇవ్వడం, ప్రభుత్వ పథకాల అమలులో తర తమ భేదాలను విస్మరించి సరైన అర్హులకు ప్రభుత్వ పథకాలు/సేవలు/సహాయాలను అందజేయడం లాంటి విధులను నిర్వహించడంలో సివిల్ సర్వెంట్స్ సఫలం కావడం అనాదిగా జరుగుతోంది. నాటి సర్దార్ పటేల్ ప్రసంగానికి గుర్తుగా ప్రతి ఏట 21 ఏప్రిల్ రోజున దేశవ్యాప్తంగా "జాతీయ పౌర సేవకుల దినోత్సవం లేదా నేషనల్ సివిల్ సర్వీసెస్ డే"ను నిర్వహించుకోవాలని 2006లో తీర్మానించడం జరిగింది.

దేశ పాలన వ్యవస్థలో పౌర సేవకులు వెన్నెముకగా నిలుస్తున్నారు. భారతీయ సివిల్ సర్వీసెస్‌లో ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, సెంట్రల్ సర్వీసెస్ ఏ అండ్ బి విభాగాలు ఉన్నాయి. దేశ సివిల్ సర్వెంట్లను ప్రతి ఏట జాతీయ స్థాయి పోటీ పరీక్షను నిర్వహిస్తున్న యూపిఎస్‌సి నిబద్ధత అమూల్యమైనది. నేటి సివిల్ సర్వెంట్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో రెడ్–టేపిజమ్, నియమ నిబంధనల్లో లొసుగులు, ప్రజల హక్కులు/భాద్యతల్లో అవగాహన లేమి, అపరిమిత రాజకీయ జోక్యం, పారదర్శక పాలన లోపాలు, జవాబుదారీతనం లేకపోవడం, విలువల పతనం, రాజకీయ కక్షపూరిత బదిలీలు, అవినీతిమయ ఆలోచనల వరదలు, నిజాయితీ పాలనకు అడ్డుగా నిలుస్తున్న బలమైన అక్రమ వ్యవస్థలు, అశ్రిత పక్షపాత పాలకులు లాంటి అంశాలు ప్రస్తుత సివిల్ సర్వెంట్లను వెంటాడుతున్నాయి. వీటికి లొంగిన కొందరు అధికారులు సివిల్ సర్వెంట్స్ వర్గానికే చెడ్డ పేరు తెస్తున్నారని గమనిస్తున్నాం.

ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవం, సామాజిక మార్పులు, ప్రజా అవసరాలను ఆకళింపు చేసుకుంటూ కాలానుగుణంగా సివిల్ సర్వెంట్స్ సేవలు మారుతూ పలు సందర్భాల్లో సవాళుగా కూడా నిలుస్తున్నాయి. నైతిక విలువలకు పట్టం కట్టడంతో పాటు పారదర్శక పాలనకు మారు పేరుగా పౌర సేవకులు తమ విధులను నిర్వహించాలి. ప్రజా సమస్యలకు పరిష్కారాలు, ప్రజలతో మమేకమై సేవలను విస్తరించడం, సివిల్ సర్వెంట్స్ ప్రజా శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వడం గమనిస్తున్నాం. సమ్మిళిత సుస్థిరాభివృద్ధి సాధనలో సివిల్ సర్వెంట్స్ భూమిక వెలకట్టలేనిది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విలువలు వేగంగా పతనమవుతున్న సంధి కాలంలో నేటి సివిల్ సర్వెంట్స్ "అడకత్తెరలో పోక చెక్క" వలె అమాయక ప్రజలు, అవినీతి రాజకీయ నాయకుల నడుమ నలిగి పోవడం చూస్తున్నాం. భరత జాతి నిర్మాణంలో పాలకులు, అధికార యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, నిష్పాక్షిక వార్త పత్రికలు తమ తమ విధులను సక్రమంగా నిర్వహించిన నాడు దేశ సమగ్రాభివృద్ధి వేగంగా జరుగుతుందని నమ్ముతున్నాం. రాజకీయ అవినీతిచెదలు సివిల్ సర్వెంట్స్‌ను కూడా విడిచి పెట్టడం లేదు. సివిల్ సర్వెంట్స్‌లో కూడా అవినీతి తిమింగలాలు తిష్ట వేయడంతో ప్రజలకు తీరని నష్టం జరుగుతున్నది. పాలకుల పదవి తాత్కాలికమని, అధికారుల పదవి దీర్ఘకాలికమని గమనించి సివిల్ సర్వెంట్స్ ప్రజా సేవలో మునిగి ఆత్మ సంతృప్తిని పొందుతూ మంచి ఉన్నతాధికారులుగా ప్రజల గుండెల్లో నిలవాలి.

సివిల్ సర్వెంట్స్ ధ్యేయం ప్రజా శ్రేయస్సు కావాలి. పౌరుల ప్రయోజనాల కోసమే వారు అంకితం కావాలి. పనిలో శ్రేష్టత, నిబద్ధతలను పునరుద్ధరించడానికి 'నేషనల్ సివిల్ సర్వెంట్స్ డే' మరో సందర్భం కావాలి. 'భారత పౌర సేవల పితామహుడు'గా 'చార్లెస్ కార్న్‌వాలిస్' పేర్కొందారు. 1864లో భారతీయ సివిల్ సర్వీస్‌లో చేరిన తొలి భారతీయుడు 'సత్యేంద్ర నాథ్ ఠాగూర్', 1951లో తొలి మహిళా సివిల్ సర్వెంట్ ఐఏఎస్ అధికారిణి 'అన్నా రాజ్యం మల్హోత్రా'లు చూపిన బహుముఖీన ప్రతిభ నేటి పౌర సేవకులకు ప్రేరణ కావాలి. 1922 నుండి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను భారత్‌లో నిర్వహించడం ప్రారంభమైంది. ప్రజల అవసరాలకు, ప్రభుత్వ నియమ నిబంధనలకు మధ్య నిరంతర ఘర్షణ వాతావరణం నెలకొని ఉంటుంది. నిబద్ధత కలిగిన సివిల్ సర్వెంట్స్ దురాలోచన కలిగిన రాజకీయ నాయకులను విస్మరిస్తూ తమ విధులను నిక్కచ్చిగా నిర్వహిస్తూ ప్రజల మనస్సుల్లో దేవుడిగా నిలవాలని కోరుకుందాం, పౌర సేవకుల శ్రమకు కృతజ్ఞతలు తెలియజేద్దాం.

# ఆ నెత్తుటి మరకలకు 43 ఏళ్లు



ఇంద్రవెల్లి గాయం ఆదివాసీల మనసులో నుండి ఇంకా చెరిగిపోలేదు. దోపిడీకి వ్యతిరేకంగా జంగ్ సైరన్ మోగించి కదిలి వచ్చిన అదివాసుల నెత్తుటి మరకలను వారు మరచిపోలేకపోతున్నారు. 1981 ఏప్రిల్ 20న ఆదివాసీ గూడేలు చిందరవందర అయిన రోజు అడవి తల్లి చెమర్చిన రోజు...43 ఏళ్ళు కావస్తున్నా ఆ గాయం ఇంకా మానలేదు, ఆ రోజు వచ్చిందంటే అక్కడ గంభీరమైన వాతావరణం నెలకొంటుంది. దోపిడీ, దౌర్జన్యాలతో, అడవి బిడ్డలు బుక్కెడు బువ్వ కోసం పడరాని కష్టాలు పడుతున్న రోజులవి. హద్దులు లేని దోపిడీతో అడవి తల్లి ఆగం అవుతున్న సందర్భం.. దళారుల దౌర్జన్యాలను ఎండగడుతూ తిరగబడ్డారు. తుడుం మోత వాళ్ళ చైతన్య శంఖారావంగా మారింది. ఆదివాసీలను పీడించుకుతింటున్న షావుకార్లు(వడ్డీ వ్యాపారులు), గిరిజనేతరుల వలసల వల్ల, ఆదివాసీ ప్రాంత భూములు, వనరులు అన్యాక్రాంతం జరుగుతుంటే, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు చూసి చూడనట్టు ఉండడం గమనించిన ఆదివాసీలు, వారి హక్కులను కాపాడుకోవడం కోసం కార్యాచరణ రూపొందించారు. గిరిజన రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో 1981 ఏప్రిల్ 20న ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలంలో భారీ బహిరంగ సభను తలపెట్టారు గూడల్లో తుడుం మోగించి ప్రచారం చేశారు.

ఏజెన్సీ ఆదివాసి ప్రజలంతా, చిన్న పెద్ద తేడా లేకుండా ప్రవాహంలా ఇంద్రవెల్లికి బయలుదేరారు. సమావేశానికి అదివాసులను రాకుండా ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసింది. వాహనాలను రాకుండా ఎక్కడికి అక్కడ అడ్డుకున్నారు అయిన ఒక్కసారిగా ఆదివాసులు వేలాదిగా ఇంద్రవెల్లికి పోగయ్యారు. ఆ రోజు ఇంద్రవెల్లిలో వారసంత జనంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. అది చూసి పోలీసులు విస్తుపోయారు. సభా స్థలం నుండి భారీ ఊరేగింపు ప్రారంభమైనది. అదివాసుల నినాదాలతో ఇంద్రవెల్లి మార్మోగింది. అయితే ఊరేగింపుగా వస్తున్న అదివాసులకు, పోలీసులకు మధ్య మాట మాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అది జీర్ణించుకోలేని ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగంతో అమాయకపు అదివాసులపై ఫైరింగ్ చేయించింది. ఆ ఫైరింగ్‌కి కొంత మంది ఆదివాసులు అక్కడికి అక్కడే మృతి చెందితే, మరి కొందరు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అడవి వెంట పరుగులు తీశారు. పచ్చని చెట్లకు ఎర్రని రక్తపు మరకలు అంటి అడవి అంతా అదివాసుల రక్తపు మరకలతో ఆ ప్రాంతమంత రణక్షేత్రంగా మారింది. నిసిగ్గుగా ప్రాణాలు హరించిన ప్రభుత్వమే ఆ రక్తపు ముద్దలను 13 మందిగా లెక్క కట్టింది. కానీ అదివాసుల కన్నీళ్లే చెబుతున్నాయి. 80 మందికి పైగా మారణహోమం అని. ఇంద్రవెల్లి ఘటన పచ్చని ఆకులపై ఎర్రని నెత్తుటి సాక్షిగా అదివాసులు తమ ప్రాణాలను కోల్పోయిన ఘటన యావత్ దేశన్నే చలింపచేసింది.

ఇంద్రవెల్లి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరుల గుర్తుగా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసులు 1986 ఏప్రిల్ 19న ఇంద్రవెల్లిలో స్థూపం ఏర్పాటు చేశారు. ఇంద్రవెల్లి పోరాట చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియద్దు అని, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దురుద్దేశ్యంతో డైనమెట్లతో స్థూపాన్ని పేల్చి వేసింది. మళ్ళీ ప్రజలు స్తూపాన్ని పునర్నిర్మించుకున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 20 వచ్చింది అంటే అక్కడ భయానక వాతావరణం, స్తూపం వద్ద ఇనుప బూట్ల శబ్ధం. ప్రజలకు భయాందోళన కలిగిస్తూ పోలీస్ బందోబస్తు, అంక్షలతో అతి కొద్ది మందికి మాత్రమే నివాళులు అర్పించడానికి అనుమతి ఇచ్చేది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆదివాసులు కూడా చాలా క్రియాశీలక పాత్ర పోషించారు. రాష్ట్రం ఏర్పడితే మాకు ఏజెన్సీ వనరుల పై పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది, ఆదివాసీ చట్టాలు అమలు అవుతాయి అని ఆకాంక్షించారు, కానీ 10 ఏళ్ళ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నాటి ఆంధ్ర పాలకులలాగే భూములను, వారి చట్టాలను తుంగలో తొక్కేసి, హక్కులను హరించింది. నేటితో ఇంద్రవెల్లి మారణహోమానికి 43 ఏళ్ళు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఇంద్రవెల్లిలో అసువులు భాసిన ఆదివాసీ అమరవీరులను స్వేచ్ఛగా స్మరించుకోడానికి ఎలాంటి అంక్షలు లేకుండా అనుమతి ఇచ్చి, స్తూపాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దాలి. తమ రక్షణ కోసం పోరాటాలు చేసే దుస్థితి నుంచి తప్పించి జల్, జంగల్, జమీన్లపై పూర్తి స్వేచ్ఛా అధికారాలు అదివాసులకు లభింపచేసినప్పుడే ఇంద్రవెల్లి అమరుల త్యాగాలకు మనం అర్పించే ఘన నివాళి ఔతుంది. జోహార్ ఇంద్రవెల్లి అమరవీరులకు జోహార్.

## కాంగ్రెస్‌లో చేరిన భారాస నాయకులు



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండల కేంద్రానికి చెందిన భారాస సీనియర్ నాయకుడు ఒర్సు రాములుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మోర్తాడ్ లోని ప్రజానిలయంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల శివకుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి, గుమ్మిర్యాల్ మాజీ ఎంపీటీసీ గడ్డం లింగారెడ్డి, బద్దం లింగారెడ్డి, పురుషోత్తమ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా అంతరాష్ట్ర చెక్ పోస్టు తనిఖీలు



**వాస్తవ నేస్తం,బోనకల్:** తెలంగాణ ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన వత్సవాయి బోనకల్ గ్రామాల మధ్య బిబిసి బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ను శనివారం గుంటుపల్లి గణేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.చెక్ పోస్ట్ వద్ద ప్రతిరోజు తనిఖీ చేస్తున్న వాహనాల నంబర్స్ నమోదు రిజిస్టర్ ను ఆయనపరిశీలించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఇరువైపుల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విధంగా అంతరాష్ట్ర చెక్పోస్ట్ ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వాహనాలలో అక్రమంగా నగదు, బంగారం అనుమతి లేకుండా ఏ విలువైన వస్తువు తీసుకెళ్లిన సీజ్ చేయాలని ఆదేశించారు. ఏ వాహనాన్ని తనిఖీ చేయకుండా వదల వద్దని ఆదేశించారు. ఎన్నికల సమీపిస్తుండటంతో వాహనాలలో నగదు రవాణా జరిగే ప్రమాదం ఉందని చెక్ పోస్ట్ సిబ్బంది 24 గంటలపాటు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట , ఏ ఆర్ ఓ గుంటుపల్లి గణేష్, మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గోగులోతు లక్ష్మణ్ ఏఈ, చెక్ పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంధం శ్రీనివాసరావును పరామర్శించిన ఎమ్మెల్సీ తాత మధు

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ , బోనకల్లు మండలం బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బంధం శ్రీనివాస్ రావు సతీమని బంధం విజయ(55) ఆకాలంగా మృతి చెందడంతో వారి భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాత మధు సుధన్ , జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, మాజీ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు లు ముష్టికుంట గ్రామానికి వచ్చి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఆ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి నాగేశ్వరరావు, వేమూరి ప్రసాద్, పార ప్రసాదు, గద్దల వెంకటేశ్వర్లు, హుస్సేన్, వేమూరి ప్రసాద్, పార ప్రసాదు, గద్దల వెంకటేశ్వర్లు, మొండితోక జయాకర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, మధిర మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మధిర టౌన్ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వర రావు, మాజీ ఎంపీటీసీ ఇటికాల శ్రీను పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లిన నాయకులు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంటరీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలి వెల్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సిద్ధన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ,మున్సిపల్ కౌన్సిలర్ కు పట్లూరు నాగరాజ్ గౌడ్,గుండు రవి, ప్రసన్న లక్ష్మి శంకర్ గౌడ్, ఎంపీటీసీ లు మమత,శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు, విష్ణువర్ధన్ రెడ్డి, పట్నం సుభాష్, రైపడ్ రమేష్, మామిడి రాజు, విఠల్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు చోటు,మాజీ సర్పంచ్ మధు, భూపాల్ రెడ్డి, మగ్దూం పటేల్,ఆశిరెడ్డి ,చింటూ గౌడ్, ఏసు, బలరాం శ్రీనివాస్, పట్టణ మండల నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు.

## ఎగ్జిట్ పోల్స్ నిషేధం: జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఈనెల 19 నుండి జూన్ 1 సాయంత్రం ఆరున్నర గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ను జాతీయ ఎన్నికల సంఘం నిషేధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన పత్రికల్లో ప్రచురించిన టీవీ, ఇతర ప్రసార మాధ్యమాలలో ప్రసారం చేసిన సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నిబంధనలకు లోబడి జూన్ 1 సాయంత్రం 6:30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ఎవరు నిర్వహించవద్దని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126(%ూ%) ప్రకారం శిక్షార్హులని తెలిపారు.

# కేసీఆర్ రాజకీయ వేగం అందుకోగలరా



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ మార్క్ ఇంకా చూపిస్తూనే ఉన్నారు. ఆయన రాజకీయంతో రెండు ప్రధానపార్టీలు పోటీ పడలేకపోతున్నాయి. ఆ పార్టీలు జాతీయ పార్టీలు కావడం నిర్ణయాలు ఢిల్లీలో జరగాల్సి ఉండటంతో గందరగోళం ఏర్పడుతోంది. కానీ కేసీఆర్ మాత్రం తమ పార్టీ నేతల్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పంచుకున్నప్పటికీ ఏ మాత్రం ఒత్తిడికి గురి కాకుండా అభ్యర్థులను ఖరారు చేసి బీఫామ్స్ కూడా ఇచ్చేశారు. ప్రచారానికి రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దాదాపు మూణ్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటించారు కేసీఆర్. నిజానికి అప్పుడు టిక్కెట్ల కోసం పార్టీ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. అప్పుడు అధికార పార్టీ . మూడో సారి అధికారంలోకి వస్తామన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. అయినా అసంతృప్తిని లెక్క చేయకుండా ఉండే వారు ఉంటారు.. పోయేవారు పోతారు అని.. అన్ని పార్టీల కంటే ముందే బీఫాంలను అందజేశారు. ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని ప్రచారం జరిగినా ఆయన చేసిన ప్రకటనకే కట్టుబడి ఉన్నారు. ఈ కారణంగా చాలా మంది కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. అయినా పట్టించుకోలేదు. లోక్ సభ ఎన్నికలకు వచ్చే సరికి.. టిక్కెట్ ఇస్తామన్నా కూడా నేతలు వేరే పార్టీలకు వెళ్లిపోయారు. అయినా కేసీఆర్ పోయిన వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయాల్ని చూసుకున్నారు. అభ్యర్థుల్ని ఎంపిక చేసి బీఫామ్స్ మాత్రమే కాదు.. వారికి ఎన్నికల ఖర్చుల కోసం రూ. 95 లక్షలు కూడా ఇచ్చారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకంటే ఒకడుగు ముందుకేసి అందరికంటే ముందుగానే బీఫాంలను అందచేశారు కేసీఆర్. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయినా అధికార కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో డైలమాలో ఉంది. ఇంకా మూడు స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ? ఒకట్రెండు స్థానాల్లో వారిని మార్చేందుకు నానా తంటాలూ పడుతోంది. ఈ రెండు పార్టీల పరిస్థితి ఈ విధంగా ఉంటే? కేసీఆర్ మాత్రం గురువారం తన పార్టీ అభ్యర్థులకు ఏకంగా బీఫాంలనే అందజేశారు. వాటితోపాటు ఎన్నికల ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.95 లక్షల చెక్కును పార్టీ తరపున ఆయన ఇచ్చారు. ఇదే సమయంలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు వీలుగా తన రాష్ట్రవ్యాప్త పర్యటనల నిమిత్తం బస్సు యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను, సంబంధిత ప్రణాళికను ఖరారు చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల టిక్కెట్లు ఇచ్చిన తర్వాత కూడా పలువురు నేతలు బీఆర్ఎస్‌కు హ్యాండిచ్చారు. వీరిలో కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డి, కే.కేశవరావు తదితర సీనియర్లు కూడా ఉన్నారు. ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు కూడా పార్టీని వీడారు. హైదరాబాద్ నగరంలో కీలక నాయకుడైన మాజీ మంత్రి మల్లారెడ్డి , తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంటి వారు సైతం సైలెంటయిపోయారు. ఇలాంటి సమయంలో పార్టీలో నైరాశ్యం పోగొట్టి, క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కేసీఆర్ పలు వ్యూహాలు రచించారు. కాను మరోసారి ఉద్యమ నాయకుడ్ని అవుతానని కేసీఆర్ చెబుతున్నారు. అధికార కాంగ్రెస్ మాత్రం మూడు స్థానాల విషయంలో ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఖమ్మంకు పొంగులేటి ప్రసాదరెడ్డి, కరీంనగర్‌కు వెల్చాల రాజేందర్‌రావు, హైదరాబాద్‌కు సమీర్ వలీవుల్లా లను అభ్యర్థులుగా నిర్ణయించారని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. కానీ అధికారిక ప్రకటన మాత్రం రావడం లేదు. కరీంనగర్ టికెట్ ఎవరికన్న విషయంలో పార్టీ హైకమాండ్ ఆది నుంచి సామాజిక కోణంలోనే ఆలోచిస్తోంది. ఇక్కడ మొదటి నుంచీ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితోపాటు వెలమ సామాజిక వర్గానికి చెందిన వెల్చాల రాజేందర్‌రావు పేరు మాత్రమే పరిశీలించారు. హైదరాబాద్‌లో నుంచి పోటీ చేయడానికి హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లాను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. అలీ మస్కతి పేరును చివరి వరకు పరిశీలనలోకి తీసుకున్నా మజ్లిస్ పెద్దల అభ్యంతరంతో ఖరారు చేయలేదని చెబుతున్నారు. మరో వైపు ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి అంశం పీట ముడిపడిపోయింది. అక్కడ కూడా రెడ్డి సామాజికవర్గ అభ్యర్థికి ఖరారు చేస్తే.. ఇతర వర్గాల మద్దతు లభించడం కష్టమన్న వాదన వినిపిస్తోంది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సోదరుడి కోంస తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పార్టీలో చేరినప్పుడు ఆయనకు ఇచ్చిన హామీ మేరకు.. ఆయన సోదరుడికే టిక్కెట్ ఇస్తున్నారని చెబుతున్నారు. మరో వైపు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికిన ప్రధాన వర్గం... ఈ సారి కాంగ్రెస్ కు మద్దతు పలికే అవకాశాలు ఉండవని అంచనా వేస్తున్నారు. ఇరప్పటికే మాదిగ వర్గం కాంగ్రెస్ కు దూరమయింది. అన్నీ రెడ్డి వర్గానికే కేటాయించడం వల్ల మిగతా అన్ని వర్గాలు దూరమవుతాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో మూడు టిక్కెట్ల ఖరారు తర్వాత కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఎలా చూసినా కాంగ్రెస్ అభ్యర్థుల కసరత్తు దారి తప్పిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. బీజేపీ ఎంపీ అభ్యర్థుల మార్పు అంశం మరోమారు చర్చనీయాంశమవుతున్నది. పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్ స్థానంలో సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్‌ను బరిలోకి దింపాలని యత్నిస్తోంది. ఆ దిశగా ఢిల్లీ నాయకత్వం వడివడిగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టిన నాయకత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా తన నియోజకవర్గాన్ని, హైదరాబాద్‌ను విడిచి ఎక్కడకు వెళ్లడం లేదు. పెద్దపల్లి నుంచి ఆ పార్టీ తరఫున బరిలో దిగిన శ్రీనివాస్ బలమైన అభ్యర్థి కాదనీ, ప్రచారంలోనూ వెనుకబడుతున్నాడని అమిత్‌షా టీమ్ గుర్తించిందని చెబుతున్నారు. ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నుంచి వివేక్ పోయిన తర్వాత బీజేపీకి పెద్దపల్లిపై పెద్దగా పట్టు లేకుండా పోయింది. వివేక్ కాంగ్రెస్‌కుపోయి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆయన కొడుకు గడ్డం వంశీ పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మారాడు. గులాబీ పార్టీలో సీటు దక్కదనే నిర్ధారణకు వచ్చిన సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్ కాంగ్రెస్‌లో చేరాడు. నేతకాని వెంకటేశ్‌కు కాంగ్రెస్‌లోనూ నిరాశే ఎదురైంది. నేతకాని వెంకటేశ్‌ను బీజేపీ దగ్గరకు తీసుకుంటున్నది. ఆ నియోజకవర్గం నుంచి ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశముందనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది. పెద్దపల్లి అభ్యర్థి మార్పుపై రెండు, మూడు రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ జిల్లా యంత్రాంగం అంగీకరించే పరిస్థితిలో లేదు. రాష్ట్ర నాయకత్వంలోని కొందరు కీలక నేతలు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని నేటికీ బలంగా వ్యతికిస్తున్నారనే ప్రచారముంది. ఆర్థిక అంగుఅర్భాటాలున్న తేరా చిన్నపురెడ్డినిగానీ, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న బీసీ సామాజిక తరగతికి చెందిన రామరాజు యాదవ్‌ను గానీ బరిలో దింపాలనే ఒత్తిడి రాష్ట్ర నాయకత్వంపై ఉంది. ఈ డైలమాలు ఇలా కొనసాగుతున్నాయి. ఫలితం ఎలా ఉన్నా..కేసీఆర్ మాత్రం కన్ ఫ్యూజన్ లేకుండా రాజకీయాలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నిస్థానాలు వస్తాయన్న సంగతిని పక్కన పెడితే.. రాజకీయ వ్యూహాల్లో మాత్రం కేసీఆర్ అందరి కంటే ముందున్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. గెలిచినప్పుడు అపర చాణక్యుడంటారు.. ఓడిపోతే ఇదేం వ్యూహం అంటారు. అందుకే.. ఫలితాలతో సంబంధం లేకుండా చూస్తే. కేసీఆర్ చాలా వేగంగా ఉన్నట్లే లెక్క.

## నువ్వెంత.. నీ బతుకెంతా..!? మాజీ మంత్రి కొల్లు రవీంద్ర


**మచిలీపట్నం :** మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఎమ్మెల్యే పేర్ని నానిపై మండిపడ్డారు. మచిలీపట్నంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల ప్రజాగళం సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ప్రజాగళం సభకు వచ్చిన జనప్రభంజనానికి పేర్ని నానికి మతిభ్రమించింది. పేర్ని నాని ఏం మాట్లాడుతున్నాడో అతనికే తెలియడం లేదు. కిందా పైనా తెలియకుండా చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నాడని అన్నారు. చంద్రబాబుని విమర్శించే స్థాయి పేర్ని నానికి లేదు. కొడుకును ప్రమోట్ చేసుకోవడమే తప్పా చేసిన తప్పులకు పశ్చాతాపం పడాలనే ఆలోచన పేర్ని నానికి లేదు. నీ బట్టలు ఊడదీసే చిట్టా రెండు రోజుల్లో రాబోతోందని అన్నారు. పెయిడ్ ఉద్యమం అని ప్రజా ఉద్యమాన్ని ఎగతాళి చేయలేదా..!? “అమ్మ తోడు పెదపట్నంలోనే పోర్టు” అన్నది నువ్వు కాదా..!? ఈ రోజు పోర్టు గురించే మాట్లాడే అర్హత నీకు ఉందా..!? 2014లో బందరుకు పోర్టు తీసుకురాకపోతే కోనేరుసెంటరులో ముక్కు నేలకు రాసి రాజకీయ సన్యాసం చేస్తా అన్న మాటలు ఏమైపోయాయని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మేం రైతులకు పెద్ద ఎత్తున పరిహారం ఇచ్చి పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించాం. అప్పుడు కూడా రైతుల్ని రెచ్చగొట్టి పోర్టు నిర్మాణాన్ని అడ్డంకులు సృష్టించిన వ్యక్తి పేర్ని నాని. మీరొచ్చిన తర్వాత పోర్టు నిర్మాణానికి సహకరించామే గానీ ఏ రోజు కూడా నీలా రైతుల్ని రెచ్చగొట్టలేదు. పోర్టు శంకుస్థాపనకు మేం రూ.8కోట్లు ఖర్చు పెట్టామని తప్పుడు మాటలు మాట్లాడుతున్నావ్. దమ్ముంటే రా లెక్కలు తీద్దామని అన్నారు. బందర్ కు మెడికల్ కాలేజ్ వచ్చిన తర్వాత నువ్వేం చేశావ్.. స్టేట్ గవర్నమెంట్ నుంచి ఒక్క రూపాయి తెచ్చావా..!? మెడికల్ కాలేజ్ భూముల కేటాయింపు 8 కోట్లు అవినీతి జరిగిందని కాగ్ చెప్పింది. దీనిపై ఎప్పుడైనా సమాధానం చెప్పావా..!? బందరుకు కరోనాను పరిచయం చేసింది నువ్వు, నీ కొడుకు కాదా..!? మీ కార్పొరేటర్, నీ కారు డ్రైవర్ మరణానికి కారణమైంది నువ్వు కాదా..? తిరుపతి బై ఎలక్షన్ ప్రచారానికి వెళ్లి వచ్చి బందరులో కరోనా వ్యాప్తికి కారకులైంది నువ్వు, నీ కొడుకు కాదా..!? నీ కొడుకు కరోనాలో పొడిచేశాడు అని చెబుతున్నావ్ కాదా. నీ కొడుకు కరోనాలో సర్వీస్ చేస్తే ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ లేక ఆరుగురు కరోనా పేషెంట్స్ ఎందుకు చనిపోయారు..!? బెడ్లు లేక వందల మంది ఎందుకు చనిపోయారు..!? కరోనా పేరు చెప్పుకుని అవినీతికి పాల్పడిన చరిత్ర నీది, నీ కొడుకుది. నీ కొడుకు నువ్వు రెమిడైజ్ ఇంజక్షన్లు అమ్ముకున్నది వాస్తవం కాదా..? నీ కొడుకు ఫోటో ఫోజుల కోసం హాస్పిటల్ లో కరోనా జాగ్రత్తలు తీసుకోకుండా వెళ్లి ఎంతో మందికి కరోనా అంటించింది వాస్తవం కాదా..? కరోనా సంయంలో నేను ఇంట్లో పొడుకున్నానా..!? నేను ఇంట్లో పొడుకుంటే నాపై కరోనా కేసులు ఎందుకు పెట్టించావో చెప్పు..!? చిలకలపూడిలో రెడ్ జోన్లు పెట్టి ఇంట్లో నుంచి ఎవరినీ బయటకు రానివ్వకుండా నిర్భందించావ్. కోవిడ్ తో చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి నేను వెళితే పోలీసులతో నన్ను అడ్డుకున్నావనిఅన్నారు. కరోనా సమయంలో నువ్వు, నీ కొడుకు చేసింది షో తప్ప ఇంకేమిలేదు. కోవిడ్ నిబంధనలు అతిక్రమించి వందల మంది చావుకు కారకులయ్యారు. బందరును ఒక గంజాయి కేంద్రంగా మార్చారు. మచిలీపట్నంలో అడుగడుగున జరుగుతున్న దాడులకు మీరు పెంచిపోషించిన గంజాయి బ్యాచ్ కాదా..!? పోలీస్ స్టేషన్ పై దాడి చేసింది వాస్తవం కాదా..!? జనసేన నేతకు చెందిన బార్ పై దాడి చేసింది వాస్తవం కాదా..!? పోతేపల్లిలో యశ్వంత్ అనే యువకుడిపై దాడి చేసింది వాస్తవం కాదా..!? ఓ పెళ్లిలో తోట యశ్వంత్ అనే జనసేన కార్యకర్త భోజనం చేస్తుంటే దాడి చేసింది



# అధిక కొవ్వు వల్ల వచ్చే సమస్యలు

శరీరంలో ఎక్కువ కొవ్వు ఉంటే చాలా సమస్యలు వస్తాయి. అందుకే ఉదయం లేచిన తర్వాత నుంచి పరుగులు, రన్నింగ్ లు అంటూ చాలా కష్టపడతారు చాలా మంది.కొందరు ఏకంగా ఫుల్ డైట్ లో ఉంటారు. శరీరంలో కొవ్వు పెరిగితే దాన్ని కరిగించడం చాలా కష్టమే. ఒక్కసారి కొవ్వు వచ్చిందంటే కొవ్వు తగ్గించుకోవడానికి కష్టపడే వారిని చూస్తే వామ్మో కొవ్వు అని భయపడాల్సిందే. చెప్పడానికి సింపుల్ గా ఉన్న ఆ బాధ బరిస్తేనే అర్థం అవుతుంది. మరి ఈ కొవ్వు వల్ల వచ్చే సమస్యలు ఏంటో తెలుసుకుంటే మరింత టెన్షన్ అవుతుంది.. ఈ రోజుల్లో అధిక కొలెస్ట్రాల్ పెద్ద సమస్యగా మారుతుంది. దీని వల్ల కొందరు ప్రాణాంతక సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారు. నిశ్చల జీవన శైలి, చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి సమస్యల వల్ల అధికంగా కొలెస్ట్రాల్ పెరుగుతుంది.అయితే శరీర పనితీరుకు కొలెస్ట్రాల్ అవసరం. కానీ ఇందులో మంచి, చెడు కొలెస్ట్రాల్ లు ఉంటాయి. ఏదైనా ఉండాల్సిన పాళ్లల్లో ఉంటేనే శరీరానికి మంచిది. ఇక రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే ఆరోగ్య సమస్యలు మరింత వచ్చే ఆస్కారం ఉంది.శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువైతే లోపలి కండరాలల్లో తిమ్మిరి వస్తుందని, శరీర భాగాలు బలహీనంగా మారుతాయి అంటున్నారు నిపుణులు. గుండె కండరాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గి, హార్ట్ అటాక్ వచ్చే ఆస్కారం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇక మెదడుకు సరఫరా అయ్యే రక్తంపై ప్రభావం పడి తలనొప్పి, మతిమరుపు వంటి సమస్యలు వస్తాయట. అంతేకాదు గ్యాస్, అజీర్ణం, చర్మంపై దురద, మగవారిలో లైంగిక శక్తి, మంట, వీర్యకణాలు తగ్గడం వంటి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. కొలెస్ట్రాల్ ఉండే ఆహార పదార్థాలను తక్కువ తీసుకోవడం వల్ల ఈ సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. తక్కువ కొలెస్ట్రాల్ ఆహారాలను మాత్రమే తీసుకోవాలి. ఫ్రై చేసినా ఆహారం, నిలువ చేసిన ఆహారం వంటివి తీసుకోకపోవడం మంచిది. అంతేకాదు కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్న ఆహారాలు ఏంటి అని తెలుసుకోవాలి. మీ డైట్ లో ఆరోగ్యకరమైన ఆహారాలను చేర్చుకుంటూ కొలెస్ట్రాల్ తక్కువ ఉన్న ఆహారాలు తీసుకుంటే నో కొలెస్ట్రాల్ నియమం పెట్టుకోండి. అతి సర్వత్రా వర్జయేత్ అని గుర్తు పెట్టుకోండి.

# కారణం లేకుండా ముక్కు నుంచి రక్తం వస్తుందా ?




కొంతమందికి ఉన్నట్టుంది ఒక్కసారిగా ముక్కునుంచి రక్తం వస్తూ ఉంటుంది. అయితే కొంతమందికి ముక్కు నుండి రక్తస్రావం చాలా సాధారణం. అయితే కొన్నిసార్లు అది భయానకంగా ఉండవచ్చు. ముక్కు నుండి రక్తస్రావం రెండు రకాలు. ముక్కు ముందు భాగంలో ఉన్న రక్త నాళాల నుండి రక్తస్రావం జరిగినప్పుడు ముందు ముక్కు నుండి రక్తం వస్తుంది. అదేవిధంగా ముక్కు వెనుక భాగంలో ఉన్న రక్త నాళాల నుండి రక్తస్రావం జరిగినప్పుడు పృష్ఠ ముక్కు నుండి రక్తస్రావం సంభవించవచ్చు. అలాగే హిమోఫిలియా అనే వ్యాధి కారణంగా కూడా ముక్కునుంచి తరచూ రక్తం రావచ్చు. హిమోఫిలియా అంటే.. హిమోఫిలియా అనేది జన్యుపరమైన వ్యాధి. ఇది ప్రధానంగా మనిషి శరీరంలోని రక్తం పై ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి రక్తం త్వరగా గడ్డకట్టడం సాధ్యం కాదు. గాయం తగిలినప్పుడు రక్త ప్రవాహం అస్సలు ఆగదు. కొన్నిసార్లు రోగి తన ప్రాణాలని కూడా కోల్పోవలసి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 10,000 మందిలో ఒకరు దీని బారిన పడుతున్నారు.భారతదేశంలో హిమోఫిలియా.. భారతదేశంలో చాలా తక్కువ మంది మాత్రమే దీని బారిన పడుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం భారతదేశంలో 80,000 – 100,000 వరకు తీవ్రమైన హిమోఫిలియా కేసులు ఉన్నాయని అంచనా. అయితే హిమోఫిలియా ఫెడరేషన్ ఇండియా (హెచ్ఎఫ్ఐ)లో నమోదైన మొత్తం కేసుల సంఖ్య కేవలం 19,000 మాత్రమే. హిమోఫిలియా లక్షణాలు.. సాధారణ గాయాలు, లోతైన గాయాల తర్వాత నిరంతర రక్తస్రావం కావడం, మలం/మూత్రంలో రక్తం కనిపించడం, కీళ్లలో నొప్పి, దృఢత్వం, ఎటువంటి కారణం లేకుండా ముక్కు నుండి రక్తస్రావం, భుజం లేదా మోకాలి పై గడ్డ ఏర్పడటం, చాలా కాలం పాటు తీవ్రమైన తలనొప్పి, విపరీతమైన అలసట హిమోఫిలియా వ్యాధి ప్రధాన లక్షణాలు. వీటిని అస్సలు విస్మరించకూడదంటున్నారు నిపుణులు. ఇవి ప్రాణాంతకం కూడా కావచ్చంటున్నారు. హిమోఫిలియా చికిత్స.. నిపుణుల అభిప్రాయం ప్రకారం హిమోఫిలియా లక్షణాలను ముందుగానే గుర్తిస్తే చికిత్స సాధ్యమవుతుంది. మందులతో పాటు, వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాలలో కూడా దీనికి చికిత్స అందించవచ్చు.ఆరోగ్యకరమైన ఆహారం.. హీమోఫిలియా రోగులు మంచి డైట్ ఫాలో అవ్వాలంటున్నారు నిపుణులు. ఇది రక్తస్రావం నియంత్రించడంలో, రక్తం గడ్డకట్టడాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. హిమోఫిలియా వ్యాధి గ్రస్తులు తప్పనిసరిగా ఐరన్, ప్రొటీన్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలంటున్నారు.

# జీడిపప్పు కన్నా బలాన్నిచ్చే పప్పులు



అధిక శక్తి, అధిక బలం కలిగి ఉండే ఆహారాలు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేవి బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా పప్పు, వాల్ నట్స్. వీటిలో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, అల్ఫాలెనోనిక్ యాసిడ్ వంటి ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుందని అలాగే వీటిని తీసుకోవడం వల్ల మనం ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చన్న సంగతి మనకు తెలిసిందే. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, సన్నగా ఉన్న వారు, ఎక్కువగా కష్టపడే వారు, బాడీ బిల్డింగ్ చేసే వారు ఈ గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ గింజలు మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి ఇవి అధిక ధరలతో కూడుకున్నవి. వీటి ధర కిలో 1000 రూ. పైగా ఉంటుంది.వీటిని కొనుగోలు చేసి కుటుంబంలో అందరూ తినలేరు. అలాంటి వారు వీటికి బదులుగా ఇతర గింజలను కూడా తీసుకోవచ్చు. ఈ గింజలు బాదంపప్పు, జీడిపప్పు అంత శక్తిని, బలాన్ని కలిగి ఉండడంతో పాటు వాటి కంటే చాలా తక్కువ ధరలో లభిస్తాయి. ఇందులో మొదటిది పుచ్చగింజల పప్పు. స్వీట్ లలో, వంటలల్లో ఈ పప్పును ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఇవి తక్కువ ధరలో మనకు లభిస్తాయి. అలాగే 100గ్రాముల పుచ్చగింజల పప్పులో 628 క్యాలరీల శక్తి ఉంటుంది. జీడిపప్పు, పిస్తా పప్పు కంటే వీటిలో శక్తి ఎక్కువగా ఉంటుంది. అలాగే పుచ్చగింజల పప్పులో మిగిలిన వాటి కంటే ఎక్కువగా దాదాపు 34 శాతం ప్రోటీన్ ఉంటుంది. మేక మాంసం, కోడి మాంసం కంటే కూడా ఇందులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. కనుక పుచ్చగింజల పప్పును నానబెట్టి తీసుకోవడం వల్ల ప్రోటీన్, శక్తితో పాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. ఇక రెండవది పొద్దు తిరుగుడు గింజల పప్పు. 100గ్రాముల పొద్దుతిరుగుడు గింజలపప్పులో 556 క్యాలరీల శక్తి ఉంటుంది. అలాగే 18 నుండి 20 శాతం ప్రోటీన్ ఉంటుంది. అలాగే వీటిలో ఇతర గింజల కంటే విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. 100గ్రాముల పొద్దుతిరుగుడు గింజలల్లో 35 మిల్లీగ్రాముల విటమిన్ ఇ ఉంటుంది. జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు త్వరగా వృద్ధాప్య ఛాయలు దరి చేరకుండా ఉండాలనుకునే వారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడం మంచిది. ఇక మూడవ పప్పు గుమ్మడి గింజల పప్పు. 100గ్రాముల గుమ్మడి గింజలపప్పులో 570 క్యాలరీల శక్తి, 30శాతం ప్రోటీన్ ఉంటుంది. అలాగే ఈ గింజలల్లో జింక్ ఎక్కువగా ఉంటుంది. మన శరీరానికి 7 మైక్రో గ్రాముల జింక్ అవసరమవుతుంది. కానీ గుమ్మడి గింజలల్లో 7.7 నుండి 8 మైక్రోగ్రాముల జింక్ ఉంటుంది. మెదడు చురుకుగా పని చేయడానికి, మేధాశక్తికి, తెలివితేటలు పెరగడానికి జింక్ చాలా అవసరం. గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల మన శరీరానికి కావల్సినంత జింక్ లభిస్తుంది. ఈ విధంగా ఈ మూడు రకాల గింజలను తీసుకోవడం వల్ల చాలా తక్కువ ధరలో మన శరీరానికి కావల్సిన శక్తి, బలం లభించడంతో పాటు ఇతర పోషకాలు కూడా ఎక్కువగా లభిస్తాయని

# క్యాబేజీ తింటే ఎన్ని లాభాలో తెలుసా..?



క్యాబేజీని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయంటున్నారు నిపుణులు. క్యాబేజీలో పోషకాలు అధికంగా ఉంటాయి. క్యాబేజీలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా నిండి ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్, విటమిన్లు కె మరియు సి ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థ మద్దతు, ఎముకల ఆరోగ్యానికి సహాయపడతాయి. క్యాబేజీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, అనేక రకాల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాబేజీలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది హైడ్రేషన్, బరువు నిర్వహణకు సరైన ఆహారంగా ఉపయోగపడుతుంది. క్యాబేజీని క్రమం తప్పకుండా మీ ఆహారంలో చేర్చుకోవటం వల్ల మంచి పోషకాలు అందుతాయి. 1. మధుమేహం: క్యాబేజీలోని యాంటీహైపెర్గ్లైసీమిక్ లక్షణాలు డయాబెటిక్ నెఫ్రోపతీని తగ్గిస్తాయి. అదనంగా, ఇది మధుమేహాన్ని తగ్గిస్తుంది. రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది. 2. క్యాన్సర్ నివారణ: క్యాబేజీలోని గ్లూకోసినోలేట్స్, ఇతర కూరగాయలలో సల్ఫర్ కలిగిన సమ్మేళనాలు ఉంటాయి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. ఇది కొన్ని క్యాన్సర్లను నివారిస్తుంది. 3. మెరుగైన జీర్ణక్రియ: క్యాబేజీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. కడుపు, పేగు లైనింగ్‌ను బలపరుస్తుంది. కడుపు పూతలని నయం చేయడంలో సహాయపడుతుంది. తద్వారా జీర్ణక్రియకు సహాయపడుతుంది. కేలరీలు తీసుకోవడం తగ్గిస్తుంది. 4. వాపు: క్యాబేజీలోని రసాయనాలు కణజాల వాపును తగ్గించడం ద్వారా క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, అల్జీమర్స్ వంటి వ్యాధులను నిరోధించడంలో సహాయపడతాయి. 5. గుండె ఆరోగ్యం: క్యాబేజీ రక్తపోటును తగ్గిస్తుంది. తద్వారా యువత, మధ్య వయస్కులలో గుండె జబ్బులు, మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

## 26 శాతం పెరిగిన ఎల్ఐసీ ప్రీమియం వసూళ్లు

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.36,300.62 కోట్లుగా నమోదయ్యాయి. 2023 మార్చిలో వసూలైన రూ.28,716.23 కోట్లతో పోలిస్తే ఇది 26.41% ఎక్కువ. ఎల్ఐసీ తర్వాత ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీమియం వసూళ్ల వృద్ధి 24.76 శాతంగా ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 12.58% వృద్ధి నమోదుచేసింది. మరోదిగ్గజ బీమా సంస్థ హెచ్డీఎఫ్సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీమియం వసూళ్లలో 20.05% క్షీణత చవిచూసింది. 2024 మార్చికి ప్రీమియం వసూళ్ల పరంగా ఎల్ఐసీకి 58.87% మార్కెట్ వాటా ఉంది. పన్ను మినహాయింపుల కోసం వినియోగదారులు బీమా పాలసీలు తీసుకోవడంతో, మార్చిలో బ్రీమా సంస్థల ప్రీమియం వసూళ్లలో వృద్ధి నమోదైందని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తెలిపింది. గత నెలలో ఎల్ఐసీ గ్రూప్ వార్షిక రెన్యూవబుల్ ప్రీమియం 200.62%, గ్రూప్ ప్రీమియం 47.17% దూసుకెళ్లాయి. 2023-24లో గ్రూప్ వార్షిక రెన్యూవబుల్ ప్రీమియం 140.51% వృద్ధితో రూ.843.99 కోట్ల నుంచి రూ.2,029.88 కోట్లకు చేరింది.

## మెటాలో ఏఐ ఫీచర్స్.




ఫేస్బుక్ మాతృ సంస్థ మెటా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో అడుగుపెట్టింది. వాట్సప్, ఫేస్బుక్, మెసెంజర్, ఇన్స్టాగ్రామ్ వేదికలకు తన మెటా ఏఐని ఇంటిగ్రేట్ చేసింది. లాలామా 3 లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఆధారంగా పని చేస్తుంది. దీంతో చాట్జీపీటీ తరహాలో మెటా ఏఐ చాట్బాట్ ఏ ప్రశ్నకైనా చిటికెలో సమాధానం రాబట్టొచ్చు. అంతేకాదు వాట్సప్లో ఇకపై ఏఐ సాయంతో రియల్టైమ్ ఇమేజులను రూపొందించొచ్చని మెటా చెబుతోంది. మరోవైపు తమ వేదికలపై అందిస్తున్న మెటా ఏఐని మరిన్ని దేశాలకు విస్తరిస్తున్నట్లు మెటా తెలిపింది. మన దేశంలోనూ కొందరు యూజర్లకు ఈ ఫీచర్ దర్శనమిస్తోంది. వాట్సప్ చాట్ మెనూలో వివిధ రంగులతో కూడిన వృత్తాకారంలో మెటా ఏఐ ఐకాన్ ఉంటుంది. దీనిపై క్లిక్ చేస్తే 'ఆస్క్ మెటా ఏఐ ఎనీథింగ్' అంటూ ఓ పాప్అప్ ఓపెన్ అవుతుంది. కంటిన్యూపై క్లిక్ చేస్తే మెటా ఏఐతో చాట్ మెనూ ఓపెన్ అవుతుంది. ఈ చాట్ మెనూలో వివిధ అంశాలకు సంబంధించిన చాట్జీపీటీ తరహాలో ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది. రానున్న రోజుల్లో ఈ ఫీచర్ అందరికీ అందుబాటులోకి రానుంది.

## భారత వస్త్ర ఎగుమతులు తిరోగమనం

# ఎక్స్పోర్టర్స్ ఆందోళన

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్లో భారత వస్త్ర ఉత్పత్తులు వెలవెల పోతున్నాయి. వరుసగా రెండో ఏడాదిలోనూ టెక్స్టైల్ ఎగుమతులకు డిమాండ్ తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ వస్త్ర ఎగుమతులు తిరోగమనాన్ని చవి చూశాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తలు వస్త్ర రంగాన్ని దెబ్బతీస్తున్నాయి. మరోవైపు ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడేలా భారత్ ఈ రంగానికి మద్దతును ఇవ్వడం లేదనేది ఆ రంగం పారిశ్రామిక వర్గాల ప్రధాన విమర్శ. గడిచిన 2023-24లో టెక్స్టైల్ ఎగుమతులు 34.4 బిలియన్ డాలర్ల (రూ.2.86 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ఒక్క బిలియన్ డాలర్లు (రూ.83వేల కోట్లు)లేదా 3 శాతం పతనాన్ని చవి చూశాయి. ముఖ్యంగా 2021-22లోని 41 బిలియన్ డాలర్ల (రూ.3.41 లక్షల కోట్లు)ఎగుమతులతో పోల్చితే గతేడాది 16.3 శాతం క్షీణత చోటు చేసుకుందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనంలో వెల్లడించింది. టెక్స్టైల్ రంగంలోకి పత్తినూలు, బట్టలు, తయారు చేసిన వస్తువులు, చేనేత ఉత్పత్తులు వస్తాయి. 2023-24లో పత్తి నూలు ఎగుమతులు మాత్రం 740 మిలియన్ డాలర్లకు పెరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన నిర్యట్ పోర్టల్ డేటా వెల్లడించింది. మొత్తం వస్త్ర ఎగుమతుల్లో ఉత్తర అమెరికాకు 11 బిలియన్ డాలర్లు, ఆ తర్వాత యూరప్కు 10 బిలియన్ల, పశ్చిమాసియా, నార్త్ ఆఫ్రికాకుకు కలిపి 4 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి. "మొత్తం పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. ముఖ్యంగా ప్రపంచంలోని కొన్ని



ప్రాంతాలలో నెలకొన్న మాంద్యంతో వినియోగదారుల విశ్వాసం తగ్గింది. ఎర్ర సముద్ర సంక్షోభం కారణంగా సముద్ర సరుకు రవాణా దాదాపు 100 శాతం పెరిగింది. ఎయిర్ కార్గో ద్వారా సరుకులను రవాణా చేయాలనే డిమాండ్ కారణంగా విమాన సరుకులు 200 శాతం వరకు పెరిగాయి. కాగా.. గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ ఎగుమతుల తగ్గుదల చోటు చేసుకోవడాన్ని సరిదిద్దుకోవాల్సి ఉంది." అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) వైస్ ప్రెసిడెంట్ ఇస్రార్ అహ్మద్ అన్నారు. మొత్తం వస్త్ర ఎగుమతుల్లో 42 శాతం వాటా కలిగిన రెడీమేడ్ వస్త్రాల విభాగంలో 10 శాతం పతనం చోటు చేసుకుంది. వస్త్ర ఎగుమతుల్లో కీలక వాటా కలిగిన తిరుపూర్ పరిశ్రమలు కరోనా నాటి కంటే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తిరుపూర్ ఎక్స్పోర్టర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ రాజా ఎం షణ్ముగం అన్నారు.

# నెస్లే ఉత్పత్తుల్లో అధిక చక్కెరపై దర్యాప్తు

**న్యూఢిల్లీ :** నెస్లే ఇండియా భారత్లో విక్రయించే బేబీ ఉత్పత్తుల్లో అధిక చక్కెర శాతం వుందన్న వార్తలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే దర్యాప్తు చేపట్టాలని, ఆ కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)ను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఎఫ్ఎస్ఎస్ఎఐ సిఇఓ కమలా వర్ధనరావుకు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే లేఖ రాశారు. నెస్లే కంపెనీ భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో విక్రయించే బేబీ సెరిలాక్ ఉత్పత్తుల్లో నిర్దేశిత ప్రమాణాలకంటే అదనంగా 2.7 (గ్రాములు) చక్కెరను అధికంగా కలుపుతోందని స్విట్జర్లాండ్కి చెందిన దర్యాప్తు సంస్థ 'పబ్లిక్ ఐ' ఒక నివేదికను ప్రచురించింది. జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి ఇతర దేశాల్లో మాత్రం ఇటువంటి పరిస్థితి లేదని, నెస్లే ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించింది. అధిక మోతాదులో చక్కెర ఉన్న పదార్థాలు తినడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఊబకాయం వంటి రుగ్మతలకు దారితీస్తుందని 'పబ్లిక్ ఐ' హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది.




## 'ధోని చాలా ఆకలితో ఉన్నాడు..

# ఆపడం ఎవరి తరం కాదు'

ఐపీఎల్-2024లో చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోని మరోసారి మెరుపులు మెరిపించాడు. ఈ మెగా లీగ్లో భాగంగా శుక్రవారం ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్తో మ్యాచ్లో ధోని క్విక్ ఫైర్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖరిలో క్రీజులోకి వచ్చిన ధోని బౌలర్లపై బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కేవలం 9 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 28 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఏడాది సీజన్లో ఇప్పటివరకు 5 సార్లు బ్యాటింగ్కు వచ్చిన ధోని.. అన్ని మ్యాచ్ల్లోనూ నాటౌట్గా నిలవడం గమనార్హం. ఈ క్రమంలో ధోనిపై ఆసీస్ మాజీ క్రికెటర్ టామ్ మూడీ ప్రశంసల వర్షం కురిపించాడు. 42 ఏళ్ల వయస్సులోనూ ధోని సూపర్ ఫిట్నెస్తో ఉన్నడాని మూడీ కొనియాడాడు. 42 ఏళ్ల వయస్సులోనూ ధోని చాలా ఫిట్గా ఉన్నాడు. అతడు చాలా ఫోకస్గా, ఇంకా ఏదైనా సాధించాలనే తపనతో ఉన్నాడు. అతడిని ఆపడం తరం కాదు. ధోనిలో మరో విషయం మనం మెచ్చుకోక తప్పదు. ఐపీఎల్కు ముందు అతడు ఎటువంటి క్రికెట్ ఆడటం లేదు. అటువంటిది నేరుగా వచ్చి ఈ మెగా టోర్నీలో ధోని అదరగొడుతున్నాడు. ఇది అందరికి సాధ్యం కాదు. అది ధోని



ఒక్కడికే సాధ్యమని ఈఎస్పీన్ క్రిక్ ఈన్ఫోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మూడీ పేర్కొన్నాడు. కాగా ఈ మ్యాచ్లో సీఎస్కేపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

# టిమ్ డేవిడ్, కీరన్ పోలార్డ్కు మ్యాచ్ ఫీజులో ఫైన్

**ముంబై:** ముంబై ఇండియన్స్ బ్యాటర్ టిమ్ డేవిడ్, బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్కు.. మ్యాచ్ ఫీజులో 20 శాతం ఫైన్ వేశారు. ఏప్రిల్ 18వ తేదీన పంజాబ్ కింగ్స్తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్(%ఖూా% 2024)లో ఆ ఇద్దరూ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ముంబై జట్టు సభ్యులు, సపోర్ట్ సిబ్బంది.. ఓ రివ్యూ విషయంలో బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్కు అక్రమ రీతిలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ కావడంతో డేవిడ్, పోలార్డ్లకు జరిమానా వేశారు. డేవిడ్, పోలార్డ్ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ఆర్టికల్ 2.20 చట్టాన్ని అతిక్రమించారని,అందుకే ఆ ఇద్దరికీ మ్యాచ్ఫీజులో 20 శాతం జరిమానా విధించినట్లు ఓ రిలీజ్లో తెలిపారు. ఆ మ్యాచ్ 15వ ఓవర్ను హర్షదీప్ సింగ్ వేశాడు. ఆఫ్ స్టంప్పై వేసిన ఆ బంతి .. దూరంగా వెళు _న్నట్లు అనిపించింది. ఆ సమయంలో 67 పరుగుల వద్ద సూర్య బ్యాటింగ్ చేస్తున్నాడు. ముంబై జట్టు ప్రధాన కోచ్ మార్క్ బౌచర్.. బ్యాటర్ సూర్య వైపు చూస్తూ వైడ్ అని సంకేతం ఇచ్చాడు. అతను ఇచ్చిన సంకేతం ఆధారంగా డేవిడ్, పోలార్డ్లు కూడా రివ్యూ తీసుకోవాలని సూర్యను కోరారు. అయితే ఇదంతా టీవీ కెమెరాలకు చిక్కింది. ఈ మ్యాచ్లో పంజాబ్ జట్టు ఓటమి పాలైంది.



## స్పోర్ట్స్

### టీ20 ప్రపంచకప్ జట్టును ప్రకటించేది ఎప్పుడంటే..?

### ఛాన్స్ దక్కేదెవరికో..?



ఈ ఏడాది ఐసీసీ టీ20 వరల్డ్ కప్ జరుగనున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్-2024 తర్వాత భారత్ జట్టు మెగా ఈవెంట్లో పాల్గొనున్నది. అయితే, జూన్ 2 నుంచి మొదలవనున్నది. అయితే, టోర్నీకి సంబంధించి మే 1న ఆటగాళ్ల జాబితాను పంపాల్సి ఉంది. భారత జట్టు ఎంపికపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. టీమ్ సెలక్షన్ కోసం కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్కోచ్ రాహుల్ ద్రవిడ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మధ్య సమావేశం జరిగినట్లు సమాచారం. టీ20 ప్రపంచకప్కు సంబంధించిన పేర్లను చర్చించినట్లు పలు నివేదికలు తెలిపాయి. అయితే, ఈ ఊహాగానాలను కెప్టెన్ రోహిత్ శర్మ కొట్టిపడేశాడు. తాజాగా మరో వార్త బయటకు వచ్చింది. టీ20 ప్రపంచకప్ జట్టు కోసం రోహిత్ శర్మ, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగర్కర్తో ఈ నెల 27న సమావేశమయ్యే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఆ తర్వాత సెలెక్టర్లు తర్వాత జట్టును ప్రకటిస్తారని తెలుస్తున్నది.

**ఢిల్లీకి రోహిత్ శర్మ**

ఐసీసీకి మే ఒకటి వరకు 15 మంది ఆటగాళ్ల జాబితాను ఎంపిక చేసేందుకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఢిల్లీలో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలస్తున్నది. 27న భేటీ జరుగకపోతే మరుసటి రోజునే ఢిల్లీలో సమావేశమయ్యే అవకాశాలున్నాయని సమాచారం. ముంబయి ఇండియన్స్ 27న ఢిల్లీ క్యాపిటల్స్తో మ్యాచ్ ఆడాల్సింది. ప్రస్తుతం సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగర్కార్ విదేశాలకు వెళ్లాడు. 27న జరిగే భేటీ కోసం నేరుగా ఢిల్లీకి చేరుకుంటాడని సమాచారం. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ ఎంపిక దాదాపు ఖాయమని తెలుస్తున్నది. అదే సమయంలో రోహిత్కి ఓపెనింగ్ పార్ట్నర్ ఎవరికి ఛాన్స్ ఎవరనేది సందేహాస్పదంగా మారింది. యశస్వి జైస్వాల్, శుభ్మన్ గిల్లో ఎవరికి అవకాశం దక్కుతుందో వేచి చూడాల్సిందే.

**రోహిత్తో ఇన్నింగ్స్ను ప్రారంభించేది ఎవరు?**

ప్రస్తుతం ఐపీఎల్లో యశస్వీ జైస్వాల్ ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. అదే సమయంలో శుభ్మన్ గిల్ ప్రదర్శన చెప్పుకోవాల్సినంతగా ఏమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విరాట్, రోహిత్ ఓపెనింగ్స్ చేస్తే ఎలా ఉంటుందనే చర్చ సైతం జోరుగా సాగుతోంది. అదే సమయంలో శుభ్మన్-యశస్విలలో ఒకరు బ్యాకప్ ఓపెనర్గా తీసుకునే అవకాశం ఉన్నది. ఈ పరిస్థితుల్లో నాలుగో స్థానంలో కేఎల్ రాహుల్, శివమ్ దూబే, రింకూ సింగ్ ఎవరో ఒకరికి అవకాశం లభించే ఛాన్స్ ఉంది. సూర్యకుమార్ మూడో స్థానంలో ఆడటం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తున్నది. అదే సమయంలో రిషబ్ పంత్ ఐదు స్థానంలో బ్యాటింగ్కు వచ్చే ఛాన్స్ ఉంది. హార్దిక్ పాండ్యా ఫామ్ సైతం సెలక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ ఐపీఎల్ సీజన్లో ఇప్పటి వరకు పాండ్యా తన ప్రదర్శనతో ఆకట్టుకోలేకపోయాడు. ఆరో స్థానంలో పవర్ హిట్టర్కు.. ఏడో స్థానంలో జడేలా, హార్దిక్ ఎనిమిదో స్థానంలో తీసుకోవచ్చని.. మిగతా మూడు స్థానాల్లో బూమ్రాతో పాటు అవేశ్ ఖాన్, సిరాజ్, అర్షదీప్ సింగ్ పోటీపడుతున్నారు.


# లియో మూవీలను అందుకే రిజెక్ట్ చేశా



తమిళ సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు కలిగిన హీరోలలో ఒకరు అయినటువంటి విశాల్ తాజాగా రత్నం అనే సినిమాలో హీరోగా నటించాడు. ఈ మూవీ కి కోలీవుడ్ ఇండస్ట్రీ లో మంచి గుర్తింపు కలిగిన దర్శకులలో ఒకరు అయినటువంటి హరి దర్శకత్వం వహించగా... మోస్ట్ బ్యూటిఫుల్ నటీమని ప్రియ భవాని శంకర్ ఈ సినిమాలో విశాల్ కు జోడిగా నటించింది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ మూవీ కి సంగీతం అందించాడు. ఈ మూవీ ని ఏప్రిల్ 26 వ తేదీన థియేటర్ లలో విడుదల చేయనున్నారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో ఇప్పటికే ఈ మూవీ బృందం ఈ సినిమా యొక్క ప్రచారాలను మొదలు పెట్టింది. అందులో భాగంగా ఈ మూవీ నుండి అనేక ప్రచార చిత్రాలను విడుదల చేసింది. వాటికి మంచి రెస్పాన్స్ జనాల నుండి లభించింది. ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రస్తుతం ఈ సినిమా హీరో అయినటువంటి విశాల్ అనేక ఇంటర్వ్యూవలలో పాల్గొంటూ వస్తున్నాడు. అందులో భాగంగా విశాల్ తాజాగా ఓ ఇంటర్వ్యూ లో పాల్గొన్నాడు. తాజా ఇంటర్వ్యూ లో భాగంగా విశాల్ తాను గతంలో కొన్ని సినిమాలను రిజెక్ట్ చేశాను. అలా వాటిని ఎందుకు రిజెక్ట్ చేయవలసి వచ్చింది అనే వివరాలను తెలియజేశాడు. తాజా ఇంటర్వ్యూ లో భాగంగా విశాల్ మాట్లాడుతూ ... నాకు గతంలో అల్లు అర్జున్ హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన వరుడు సినిమాలో ఆర్య చేసిన పాత్ర ఆఫర్ వచ్చింది. కానీ ఆ టైం లో నేను ఇతర మూవీ లతో బిజీగా ఉండడం వల్ల ఆ పాత్రను చేయలేకపోయాను అని చెప్పాడు. అలాగే విజయ్ హీరో గా లోకేష్ కనకరాజు దర్శకత్వంలో రూపొందిన లియో మూవీ లో అర్జున్ చేసిన పాత్ర ఆఫర్ మొదట నాకు వచ్చింది.

# ప్రియదర్శి, నభా నటేష్‌ల మధ్య ‘డార్లింగ్’ పంచాయితీ.. అసలు కారణం ఇదే.!

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి, హీరోయిన్ నభా నటేష్‌లు గొడవపడినట్లు రీసెంట్‌గా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. హీరో ప్రభాస్ వాయిస్‌తో డబ్‌స్మాష్ వీడియోను నటి నభా ఇటీవలే పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌పై స్పందించిన ప్రియదర్శి ‘వావ్.. సూపర్ డార్లింగ్.. కిర్రాక్’ అంటూ రిట్కప్లై ఇచ్చాడు. దీంతో నభా కోపంగా డార్లింగ్ ఎవరు. ‘ఐపీసీ సెక్షన్ 354ఏ ప్రకారం పరిచయం లేని ఒక స్త్రీని డార్లింగ్ అని సంభోదించడం లైంగిక వేధింపులతో సమానం’ ‘మిస్టర్.. కామెంట్ చేసే ముందు మాటలు జాగ్రత్త’ అని నభా రిప్లయ్ ఇచ్చింది. అయితే ఈ వివాదం అంతా ఒక సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే వీళ్లు చేసినట్లు కామెంట్లు వచ్చాయి. అయితే నెటిజన్లు అనుకున్నట్లుగానే ప్రమోషన్స్‌లో భాగంగా ఇలా చేశారు. ప్రియదర్శి, నభా నటేష్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘డార్లింగ్’. ఈ సినిమాకు అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తుండగా.. హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను చిత్రయూనిట్ విడుదల చేసింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తరువాత భార్య చేతిలో కీలు బొమ్మగా మారిన భర్తల స్టోరీగా ఈ సినిమా రానున్నట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో అనన్య నాగళ్ల, మోయిన్, శివా రెడ్డి, మురళీధర్ గౌడ్, కళ్యాణి రాజ్, సునీత మనోహర్, ముళ్లపూడి రాజేశ్వరి, అభిజ్ఞ, జీవన్, కృష్ణ తేజ, విష్ణు, సంజయ్ స్వరూప్, రఘుబాబు, ప్రియాంక, స్వప్నిక, శివరంజని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ఒక్క మెసేజ్‌తో ‘సలార్’ బైక్‌ను సొంతం చేసుకోండి



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్- దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం సలార్. గత ఏడాది డిసెంబరులో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 700 కోట్లకుపైగానే కలెక్ట్ చేసింది. దీంతో వెంటనే ‘సలార్’ రెండో భాగం ‘సలార్: శౌర్యంగపర్వం’ పనులను ఆరంభించారు ప్రశాంత్ నీల్. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి కావస్తుండటంతో ఇదే నెలలో షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారని తెలిసింది. సినిమా థియేటర్లు, ఓటీటీలో సందడి చేసిన సలార్ ఇప్పుడు బుల్లితెరలో వచ్చేందుకు రెడీ అవుతుంది. ఈ నేపథ్యంలో సలార్ మూవీ ఏప్రిల్ 21న ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు స్టార్ మాలో టెలికాస్ట్ కానుంది. ఈ సినిమాను చూస్తూ బైక్‌ను గెలుచుకోవచ్చని హెూంబలే ఫిలిమ్స్ ప్రకటించింది. ఏ విధంగా సలార్ బైక్‌ను సొంతం చేసుకోవాలో కూడా హెూంబలె ఫిలిమ్స్ తమ ఎక్స్ అకౌంట్ ద్వారా వెల్లడించింది.. ఏప్రిల్ 21న సలార్ సినిమాను చూస్తున్న సమయంలో స్క్రీన్ పై ఒకవైపు బైకు కనిపిస్తూ ఉంటుందట, ఆ బైక్ ఎన్ని సార్లు స్క్రీన్ మీద కనిపించిందో ప్రేక్షకులు లెక్కబెట్టాలి. అదే సమయంలో ఎస్సెమ్మెస్ లైన్లు ప్రారంభమౌతాయి. ఆ వెంటనే 9222211199 నంబర్‌కు %బాూబాూబాూ=% అని టైప్ చేసి పంపించాలి. ఈ ఎస్సెమ్మెస్‌లను ఏప్రిల్ 21 రాత్రి 8 గంటల నుంచి పంపించాల్సి ఉంటుంది. దీంతో సలార్‌లో ప్రభాస్ ఉపయోగించిన బైక్ మాడల్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని ఆయన ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# బాలయ్య 109 టార్గెట్ సంక్రాంతి కాదు



బాలకృష్ణ దర్శకుడు బాబీ కలయికలో రూపొందుతున్న సినిమాకు ఎన్నికల కోసం బ్రేక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వచ్చే నెల పదమూడు వరకు హీరో పాల్గొనే అవకాశం లేకపోవడంతో టీమ్ పూర్తయిన భాగానికి పోస్ట్ ప్రొడక్షన్ తో పాటు తదుపరి షెడ్యూల్స్ కి సంబంధించిన పనులను ప్లాన్ చేసుకోవడంలో బిజీగా ఉంది. కొంత లేట్ అయినా పర్వాలేదు అభిమానులు 2025 సంక్రాంతి బరిలో ఉండాలని కోరుకుంటున్నారు. పండగ సెంటిమెంట్ ని మరోసారి వాడుకుంటూ బ్లాక్ బస్టర్ కొట్టొచ్చని ఆశ పడుతున్నారు. అయితే బాలయ్య 109 టార్గెట్ సంక్రాంతి కావడం లేదు. ఎందుకంటే ఎలక్షన్లు పూర్తవ్వగానే వీలైనంత వేగంగా షూట్ చేసేలా బాబీ రెడీ అవుతున్నాడు. గత ఏడాది భగవంత్ కేసరి తరహాలో దసరాకు రిలీజ్ చేసే ఆలోచనలో సితార ఎంటర్ టైన్మెంట్స్ టీమ్ ఉందని ఇన్ సైడ్ టాక్. మరో బలమైన కారణం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. ఇదే సంస్థ నుంచి వచ్చే సంవత్సరం సంక్రాంతికి రవితేజ- భాను భోగవరపు కాంబో మూవీని ఆల్రెడీ లాక్ చేశారు. ప్రాజెక్టు అనౌన్స్ మెంట్ రోజే రిలీజ్ గురించి స్పష్టంగా పేర్కొన్నారు. అంటే బాలయ్యది అంత ఆలస్యం కాదనే నమ్మకంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాకపోతే తేదీ ఎప్పుడనేది కొంత కాలం సస్పెన్సే. ఆగస్ట్ నుంచి డిసెంబర్ దాకా నెలకు రెండు మూడు క్రేజీ చిత్రాలు ఆల్రెడీ డేట్లను బ్లాక్ చేసుకుని ప్రకటనలు ఇచ్చాయి. మరికొన్ని పరిస్థితులను బేరీజు వేసుకుని అనౌన్స్ మెంట్ కు రెడీ అవుతున్నాయి. ఓజి, దేవర, పుష్ప 2, భారతీయుడు 2, కంగువా, సరిపోదా శనివారం, గేమ్ ఛేంజర్ తదితరాలన్నీ క్యూ కట్టి ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటూనే బాలయ్య 109కి బెస్ట్ డేట్ పట్టాలి. ఒకవేళ అనూహ్యంగా ఏదైనా జరిగి జనవరికి కర్చీఫ్ వేసిన రవితేజ తప్పుకుంటే అప్పుడు బాలకృష్ణ చిరంజీవిల పోటీని మరోసారి చూడొచ్చు. కానీ ఆ క్లాష్ ఈసారి ఉండకపోవచ్చు.

# బాలీవుడ్‌లో ఆల్ టైమ్ రికార్డ్ సెట్ చేసిన ‘పుష్ప’



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ‘పుష్ప : ది రూల్’ బాలీవుడ్‌లో ప్రారంభమైంది. సినిమా విడుదలకు ముందే అక్కడ రికార్డ్ బద్దల కొడుతుంది. ఇండియన్ సినిమా మార్కెట్‌ను షేక్ చేస్తూ ఈ సినిమా రైట్స్ రికార్డు ధరకు అమ్ముడుపోయాయని తెలుస్తోంది. పార్ట్-1 సూపర్ హిట్ కావడంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పుష్పగాడి టార్గెట్ గ్లోబల్ మార్కెట్‌పై కూడా పడింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘పుష్ప : ది రూల్’ సినిమా థియేట్రికల్ హక్కులను రూ.200 కోట్ల రూపాయలకు ప్రముఖ బాలీవుడ్ డిస్ట్రిబ్యూటర్ అనిల్ థడానీ కొనుగోలు చేశారని తెలుస్తోంది. ఇది బాలీవుడ్‌లో ఆల్ టైమ్ రికార్డ్ డీల్ అని చెప్పవచ్చు. నాన్ హిందీ సినిమాను బాలీవుడ్‌లో అంత భారీ దక్కించుకోడం ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. పుష్ప సినిమా కోసం ఓటీటీలో కూడా గట్టిపోటీ ఉంది. ఎలాగైనా ఈ సినిమాను దక్కించుకోవాలని నెట్‌ఫ్లిక్స్ రూ.250 కోట్ల వరకు కోట్ చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇది నిజమైతే డిజిటల్ హక్కుల్లో కూడా పుష్పనే టాప్ అవుతుంది. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా ఓటీటీ రైట్స్ కోసం రూ. 170 కోట్లు పెట్టారు. దేశవ్యాప్తంగా పుష్ప చిత్రంపై భారీ అంచనాలు ఉండటంతో మార్కెట్ స్థాయి కూడా అదే రేంజ్‌లో పెరిగిందని చెప్పవచ్చు. సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com